# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

21.04.2026
మంగళవారం Tuesday

సంపుటి (volume): 1
సంచిక (Issue): 267

పేజీలు : 13
Pages : 13

వెల రూ. 2.00

Published from : Hyderabad
Circulated to : Telangana



రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి సాక్షి ఆహ్వానం పలుకుతుంది.

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

9119949944
7897222788 - 7897222789




# కేసీఆర్ ఖేల్ ఖతం

## వచ్చే ఎన్నికల్లో రా.. తేల్చుకుందాం

- కల్వకుంట్ల కుటుంబానికి కాలం చెల్లింది
- వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా కూడా దక్కదు
- కాళేశ్వరంలో లక్షకోట్లు మింగారు
- రైతు సంక్షేమం కాంగ్రెస్ విధానం
- రెండోవిడత రైతు భరోసా నిధులను విడుదల
- 2034 వరకు మళ్లీ కాంగ్రెస్‌దే అధికారం
- 2029లో నువ్వో.. నేనో తేల్చుకుందాం
- మహేశ్ గౌడ్, నా జోడీతో మళ్లీ అధికారం
- నస్తూర్‌పల్లి సభలో సీఎం రేవంత్ రెడ్డి

**జయశంకర్ భూపాలపల్లి, ఏప్రిల్ 20:** తెలంగాణ రాజకీయాల్లో మాటల యుద్ధం ముదిరి పాకాన పడింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన విమర్శలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత తీవ్రంగా స్పందించారు. కేసీఆర్ మళ్ళీ అధికారంలోకి వస్తానని భ్రమపడుతున్నారని, కానీ తెలంగాణలో ఆ కుటుంబం శకం శాశ్వతంగా ముగిసిపోయిందని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ చేసిన అవినీతి, అరాచక పాలనను ప్రజలు మర్చిపోలేదని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీని ఎలాగైతే తిరస్కరించారో, 2029 ఎన్నికల్లోనూ అదే ఫలితం పునరావృతం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు.

మిగతా 2 లో

## కాళేశ్వర ముక్తేశ్వరస్వామిని దర్శించుకున్న సీఎం

2

# మళ్లీ చీకటి రోజులు

## పునర్నిర్మాణానికి సిద్ధమవ్వండి

అధికారంలోకి రాగానే హైడ్రాను ఎత్తిపారేస్తాం..

మోసపూరిత హామీలపై ప్రజలు గోస | జగిత్యాల సభలో కేసీఆర్ గర్జన



## బీఆర్ఎస్‌లోకి సీనియర్ నేత జీవన్ రెడ్డి

## కీలక బాధ్యతలు అప్పగించిన అధినేత

**జగిత్యాల, ఏప్రిల్20:** తెలంగాణలో మళ్లీ ఉద్యమ నాటి పరిస్థితులు దాపురించాయని, పదేళ్ల పాటు వెలుగులీనిన రాష్ట్రం కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సర్వనాశనమైందని బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ధ్వజమెత్తారు. సోమవారం జగిత్యాలలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డికి కేసీఆర్ స్వయంగా గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తెలంగాణ పునర్నిర్మాణ మహాయజ్ఞంలో ప్రతి ఒక్కరూ

మిగతా 2 లో

# మేధావుల మౌనం సమాజానికి అరిష్టం

- డీలిమిటేషన్, మహిళా బిల్లుపై గళమెత్తా
- కాంగ్రెస్ కుట్రలను తిప్పికొట్టాలి
- అంబేద్కర్ ఆశయాలను అమలు చేస్తున్నది మోదీ ప్రభుత్వమే!
- కేంద్ర మంత్రి సంజయ్

3

దేశ పురోగతికి కీలకమైన డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన), మహిళా రిజర్వేషన్ బిల్లుల విషయంలో మేధావులు తమ మౌనాన్ని వీడాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. సమాజంలో జరుగుతున్న మంచి చెడులపై నిష్కర్షగా మాట్లాడాల్సిన బాధ్యత మేధావులపై ఉందని, వారి మౌనం సమాజానికి ఏమాత్రం శ్రేయస్కరం కాదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.



# కాశ్మీర్‌లో ఘోర ప్రమాదం

బస్సు బోల్తాపడి 15మంది మృతి

4





## దక్షిణ కొరియా ద్వైపాక్షిక సంబంధాలు బలోపేతం


4

అధ్యక్షుడు లీ జె మ్యూంగ్‌తో ప్రధాని నరేంద్ర మోదీ

# చెట్టును ఢీకొని కుప్పకూలిన ప్రైవేట్ జెట్

.. వివరాలు 2లో

ఇద్దరు పైలట్లు మృతి చెందినట్లు గుర్తింపు



# రూ.100 కోసం హత్య

దంపతులపై దాడిలో భర్త మృతి

2





## గడ్డపోతారం పారిశ్రామికవాడలో అగ్నిప్రమాదం

.. వివరాలు 2లో



# హర్మూజ్ దాటొద్దు

- భారత నౌకలకు నేవీ 'రెడ్ అలర్ట్'!
- ఇరాన్ కాల్పుల నేపథ్యంలో అడ్వైజరీ..
- అనుమతి వచ్చే వరకు నిలపాలని ఆదేశం

.. వివరాలు 3లో

హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలు పరాకాష్టకు చేరడంతో భారత నౌకాదళం (ఇండియన్ నేవీ) అత్యవసర హెచ్చరికలు జారీ చేసింది. భారత పతాకంతో ప్రయాణిస్తు న్న నౌకలపై ఇరాన్ బలగాలు కాల్పులు జరిపిన ఘటన ను తీవ్రంగా పరిగణించిన నేవీ, తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ఆ జలసంధి వైపు వెళ్లొద్దని నౌకలకు స్పష్టం చేసింది. ముఖ్యంగా లారక్ ఐలాండ్‌కు దూరంగా ఉండాలని సూచించింది. దేశ భద్రత మరియు వాణిజ్య ప్రయోజనాల దృష్ట్యా ఈ అడ్వైజరీ జారీ చేసినట్లు రక్షణ వర్గాలు వెల్లడిం చాయి. ఇటీవల 'జగ్ అర్ణవ్', 'సన్మార్ హెరాల్డ్' అనే రెండు భారత నౌకలు హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణి స్తుండగా ఇరాన్ బలగాలు వాటిని లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరిపాయి.



## శాంతి చర్చల్లో ప్రతిష్టంభన

చర్చలకు రావడం లేదని తేల్చిన ఇరాన్

4

# కాళేశ్వర ముక్తేశ్వరస్వామిని దర్శించుకున్న సీఎం

## కాళేశ్వరం విస్తరణకు రేవంత్ శంకుస్థాపన


## రూ.198 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులకు శ్రీకారం



**జయశంకర్ భూపాలపల్లి, ఏప్రిల్ 20:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా పర్యటనకు వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి కాళేశ్వరంలోని కాళేశ్వర ముక్తేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం రూ.198 కోట్లతో చేపట్టబోయే ఆలయ అభివృద్ధి పనులకు సీఎం భూమిపూజ చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన దక్షిణ కాశీగా పేరుగాంచిన కాళేశ్వరంలోని శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధి , మేడిగడ్డ బ్యారేజ్ పునరుద్ధరణ పనులపై ఈ పర్యటనలో ఆయన ప్రధానంగా దృష్టి సారించారు. కాళేశ్వరం చేరుకున్న ముఖ్యమంత్రికి ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. రేవంత్ రెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం, ఆలయ ప్రాంగణంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఆయన భూమి పూజ చేశారు. భక్తుల సౌకర్యార్థం కాళేశ్వరం క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ఈ సందర్భంగా ప్రభుత్వం సూచనప్రాయంగా వెల్లడించింది. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, గడ్డం వివేక్ తదితరులు పాల్గొన్నారు. ఆలయ దర్శనం అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేరుగా మేడిగడ్డ బ్యారేజ్ వద్దకు చేరుకున్నారు. గత కొంతకాలంగా వివాదాస్పదంగా మారిన మేడిగడ్డ బ్యారేజ్ కుంగుబాటు, ప్రస్తుత స్థితిగతులు , పునరుద్ధరణ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బ్యారేజ్ మరమ్మత్తులు ఎంతవరకు వచ్చాయి, వర్షాకాలం లోపు చేపట్టాల్సిన రక్షణ చర్యల గురించి ఇంజనీరింగ్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై గత ప్రభుత్వంపై విమర్శలు చేసిన నేపథ్యంలో, స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి మేడిగడ్డను సందర్శించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రాజెక్టు భద్రత , భవిష్యత్తు కార్యాచరణపై ఈ పర్యటన ద్వారా ఆయన అధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు. సీఎం పర్యటన దృష్ట్యా పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు , ఉన్నతాధికారులు ఈ పర్యటనలో ముఖ్యమంత్రి వెంట ఉన్నారు.

# రేవంత్‌తో నార్వే బృందం భేటీ

**హైదరాబాద్, ఏప్రిల్ 20:** రేవంత్ రెడ్డిని నార్వే రాయబారి హెచ్.ఈ. మే-ఎలిన్ స్టైనర్ ప్రతినిధి బృందం కలిసింది. జూబ్లీ హిల్స్ నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసినట్లు తెల పింది. ఈ సందర్భంగా తెలం గాణ అభివృద్ధి, పెటటుబడులు తదితర పలు అంశాలు ప్రస్తావనకు వచ్చాయి.





# మళ్లీ చీకటి రోజులు..

మొదటి పేజీ తరువాయి

భాగస్వాములు కావాలని, రాష్ట్ర ప్రయోజనాల కోసమే జీవన్ రెడ్డి తనతో చేతులు కలిపారని కేసీఆర్ ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో ప్రజలను నిలువునా వంచించిందని కేసీఆర్ మండిపడ్డారు. "రెండేళ్లయినా ఒక్క నిర్మాణాత్మక పని చేయలేదు. ప్రాజెక్టులను పడావు పెట్టారు, మిషన్ భగీరథను మూలన పడేశారు. ఎరువుల బస్తాల కోసం చెప్పులు క్యూలో పెట్టే దుస్థితి మళ్లీ వచ్చింది" అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో తాము ఎంతో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసిన రాష్ట్రాన్ని కాంగ్రెస్ పాలకులు అధ్వానంగా మార్చారని, కరెంటు ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందని విమర్శించారు. రైతులు, ఉద్యోగులు, నిరుద్యోగులు ఇలా ప్రతి వర్గం నేడు గోస పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

### హైడ్రాపై తొలి సంతకం.. మూసీ కూల్చివేతలపై నిప్పులు

హైదరాబాద్‌లో పేదల ఇళ్లను కూల్చివేస్తున్న 'హైడ్రా'పై కేసీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "మేము అధికారంలోకి రాగానే హైడ్రాను ఎత్తిపారేస్తాం.. దానిపైనే నా తొలి సంతకం ఉంటుంది. మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇళ్లను కూల్చే హక్కు మీకెవరిచ్చారు?" అని నిలదీశారు. ఈ ప్రభుత్వం చేసేది ప్రజాపాలన కాదు, రియల్ ఎస్టేట్ వ్యాపారమని ఆరోపించారు. కేంద్రానికి మోకరిల్లి వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టేందుకు సిద్ధమవుతున్నారని, దీనిపై తాము రాజీలేని యుద్ధం చేస్తామని హెచ్చరించారు. సీఎం రేవంత్ రెడ్డి పేరు ఎత్తకుండానే, తన మరణాన్ని కోరుకుంటున్న వారిపై కేసీఆర్ సెటైర్లు వేశారు. "కేసీఆర్ చావాలి అని శాపనార్థాలు పెడుతున్నారు. పిల్లి శాపాలకు ఉట్లు తెగుతాయా? నేను వెయ్యి జన్మలెత్తినా చావను, నా చివరి శ్వాస వరకు తెలంగాణ కోసం పనిచేస్తూనే ఉంటాను" అని స్పష్టం చేశారు. జగిత్యాలలో తాను సభ పెడుతున్నానని తెలిసి రెండో విడత రైతు భరోసా విడుదల చేశారని, తాము మళ్లీ సభ పెడితేనే మూడో విడత ఇస్తారా అని ఎద్దేవా చేశారు.

### జీవన్ రెడ్డికి కీలక బాధ్యతలు

45 ఏళ్ల స్నేహితుడైన జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరడం పార్టీకి కొత్త ఊపునిచ్చిందని కేసీఆర్ అన్నారు. ఆయనను బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తున్నట్లు ప్రకటించారు. ఉమ్మడి కరీంనగర్, పొరుగు జిల్లాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, అప్పుడు జీవన్ రెడ్డికి అత్యున్నత బాధ్యతలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ ముఖ్య నేతలు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.





# రూ.100 కోసం హత్య

## దంపతులపై దాడిలో భర్త మృతి

**మంచిర్యాల, ఏప్రిల్ 20:** మంచిర్యాలలో దారుణం చోటుచేసుకుంది. అప్పు ఇవ్వలేదన్న కోపంతో ఓ వ్యక్తి ఘాతుకానికి ఒడిగట్టాడు. దంపతులపై కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో భర్త చనిపోగా.. భార్య పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే.. దండేపల్లి మండలం ముత్యంపేటకు చెందిన శంకరయ్య దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆదివారం ఓ వ్యక్తి దుకాణం దగ్గరకు వచ్చాడు. 100 రూపాయలు అప్పు ఇవ్వమని అడిగాడు. ఇందుకు శంకరయ్య ఒప్పుకోలేదు. దీంతో ఆ వ్యక్తి గొడవకు దిగాడు. గొడవ చిలికిచిలికి గాలివానలా మారింది. విచక్షణ కోల్పోయిన ఆ వ్యక్తి శంకరయ్యపై కత్తితో దాడి చేశాడు. అడ్డం వచ్చిన శంకరయ్య భార్యపై కూడా దాడి చేశాడు. దాడి అనంతరం అక్కడినుంచి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడ్డ శంకరయ్య దంపతులను స్థానికులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శంకరయ్య ప్రాణాలు విడిచాడు. ఆయన భార్య పరిస్థితి విషమంగా ఉంది. ఇక, సమాచారం అందుకున్న పోలీసులు ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితుడి కోసం గాలిస్తున్నారు.

# 23 వరకు ఇంటర్ సప్లిమెంటరీ ఫీజు గడువు పొడిగింపు

**హైదరాబాద్, ఏప్రిల్ 20:** తెలంగాణలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు గడువును ఇంటర్మీడియట్ బోర్డు పొడిగించింది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరానికి చెందిన రెగ్యులర్ విద్యార్థులతో పాటు, ఫెయిలైన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాయడానికి ఈనెల 23వ తేదీ వరకు పొడిగించినట్లు తెలంగాణ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను నిర్వహించిన ఇంటర్ ప్రథమ, ద్వితీయ పరీక్షల ఫలితాలు ఈ నెల 12న విడుదలయ్యాయి. కాగా ఈ పరీక్షలో ఉత్తీర్ణులై మార్కులు ఎక్కువ సాధించాలని భావించే విద్యార్థులు, ఫెయిలైన విద్యారులకు మే 13 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. మే 22 నుంచి 25 వరకు ప్రాక్టికల్స్, మే 26న ఫస్టియర్, సెకండియర్ ఇంగ్లిష్ ప్రాక్టికల్స్, 28న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష, ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్ష నిర్వహించనున్నారు.

# ఢిల్లీకి బీఆర్ఎస్ బృందం

## కాళేశ్వరంపై న్యాయవాదులతో సంప్రదింపులు

**హైదరాబాద్, ఏప్రిల్ 20:** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు పార్టీ త్రిసభ్య కమిటీ ఢిల్లీ పర్యటనకు వెళ్లింది. ఈ ప్రతినిధుల బృందంలో మాజీ మంత్రి హరీశ్ రావు, మాజీ ఎంపీ వినోద్ కుమార్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఉ న్నారు. ఏప్రిల్ 22న తెలంగాణ హైకోర్టులో కాళేశ్వరం కమిషన్‌పై తుది తీర్పు వెలువడనుంది. అలాగే ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసు నేపథ్యంలో తదుపరి న్యాయపరమైన కార్యాచరణను సిద్ధం చేసేందుకు వీరి ఢిల్లీ పర్యటనకు వెళ్లారు. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులతో ఈ కమిటీ ప్రత్యేకంగా సమావేశమైంది. కాళేశ్వరం కమిషన్‌పై హైకోర్టు తీర్పు వచ్చిన తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశాలపై.. అలాగే ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసులో న్యాయపరంగా తీసుకోవాల్సిన తదుపరి చర్యలపై లాయర్లతో చర్చిస్తున్నారు.

# చెట్టును ఢీకొని కుప్పకూలిన ప్రైవేట్ జెట్

## ఇద్దరు పైలట్లు మృతి చెందినట్లు గుర్తింపు

**రాయపూర్, ఏప్రిల్ 20:** ఛత్తీస్‌గఢ్‌లోని జశ్‌పుర్ జిల్లా కొండ ప్రాంతంలో ప్రైవేటు జెట్ ఒకటి సోమవారంనాడు కుప్పకూలింది. ఆరా హిల్స్‌లో తొలుత చెట్టును ఢీకొని ఆ తర్వాత కుప్పకూలినట్టు స్థానికులు తెలిపారు. దీంతో మంటలు ఎగసిపడి పొగ చుట్టుపక్కలకు వ్యాప్తించినట్టు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో జెట్‌లోని పైలట్, కో-పైలట్ ఇద్దరూ మరణించినట్టు ప్రాథమిక సమాచారం. జెట్ కుప్పకూలిన సమయంలో అందులో ఇంకెవరైనా ఉన్నారా అనేది తెలియాల్సి ఉంది. జెట్ కుప్పకూలిన సమాచారం తెలిసిన వెటనే ఎస్ఎస్‌పీ లాల్ ఉమీద్ సింగ్ సహా సీనియర్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని సహాయక కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. ఈ ప్రమాదానికి సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది.

# గడ్డపోతారం పారిశ్రామికవాడలో అగ్నిప్రమాదం

## ఎరిత్రో ఫార్మా పరిశ్రమలో రియాక్టర్ పేలుడు

**సంగారెడ్డి, ఏప్రిల్ 20:** సంగారెడ్డి జిల్లాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. గడ్డపోతారం పారిశ్రామికవాడలో ఉన్న ఎరిత్రో ఫార్మా పరిశ్రమలో అకస్మాత్తుగా రియాక్టర్ పేలుడు సంభవించింది. ఈ ఘటనతో ఒక్కసారిగా మంటలు పరిసర ప్రాంతాలను ఆవరించాయి. పేలుడు తీవ్రత ఎక్కువగా ఉండటంతో సమీప ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. దట్టమైన పొగ పరిశ్రమ పరిసరాల్లో వ్యాపించింది.సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేసే ప్రయత్నాలు ప్రారంభించారు. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పల్సు÷ర్ ఇంజిన్లు రంగంలోకి దిగాయి. పేలుడు కారణంగా ఎవరైనా గాయపడినారా లేదా అన్నది ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. పేలుడు ఎలా జరిగింది, రియాక్టర్‌లో ఏవైనా సాంకేతిక లోపాలున్నాయా అనే దానిపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. పరిశ్రమలో భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా? లేదా అనే అంశంపైనా కూడా విచారణ జరుగుతోంది. ఈ ఘటనతో గడ్డపోతారం పారిశ్రామికవాడలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అధికారులు ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



# కేసీఆర్ ఖేల్ ఖతం

మొదటి పేజీ తరువాయి

పెద్ద పెద్ద ప్రాజెక్టులు కట్టి రైతులకు నీరిచ్చింది కాంగ్రెస్ పార్టీ అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పంటలకు గిట్టుబాటు ధర ఇచ్చే చట్టాన్ని తీసుకొచ్చిందని గుర్తు చేశారు. ప్రజాపాలనలో రైతు ఉత్సవాల పేరుతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం నస్తూర్‌పల్లిలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో సీఎం పాల్గొన్నారు. సభావేదిక పైనుంచి రెండోవిడత రైతు భరోసా నిధులను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చిన తొలిపార్టీ కాంగ్రెస్ అని అన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించి ఏడాదిలోపే చేసి చూపించాం. 25.35 లక్షల మంది రైతుల ఖాతాల్లో రుణమాఫీ కింద రూ.22 వేల కోట్లు వేశాం. గత విడతలో రైతుభరోసా కింద 9 రోజుల్లోనే రూ.9 వేల కోట్లు వేశాం. ఇవాళ రెండో విడతగా రూ.5,700 కోట్లకుపైగా రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నాం. మిగతా రూ.3,300 కోట్లు వచ్చే నెలలో రైతుల ఖాతాల్లో వేస్తాం. రాష్ట్రంలో 3.5 కోట్ల మంది పేదలకు సన్నబియ్యం ఇస్తున్నాం. పేదలకు సన్న బియ్యం ఇవ్వాలనే ఆలోచన గతంలో ఎవరికైనా వచ్చిందా? అన్నారు. గతంలో వైఎస్ఆర్- డి.శ్రీనివాస్ జోడీ కాంగ్రెస్‌ను వరుసగా ఎలా గెలిపించిందో, ఇప్పుడు తాను, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కలిసి రెండోసారి కాంగ్రెస్‌ను విజయతీరాలకు చేరుస్తామని ఆయన శపథం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే సుప్రీం అని, వారిచ్చిన తీర్పును గౌరవించకుండా కేసీఆర్ ఇంకా అహంకారంతో మాట్లాడటం ఆయన భ్రమలకు నిదర్శనమని రేవంత్ మండిపడ్డారు. కేసీఆర్ వ్యాఖ్యలు 'చిల్లర మాటలు' అంటూ కొట్టిపారేసిన సీఎం, రాష్ట్ర ప్రజలు కల్వకుంట్ల కుటుంబాన్ని ఎప్పటికీ క్షమించరని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులే తమను మళ్లీ గెలిపిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీకి కాలం చెల్లిందని, ఇకపై తెలంగాణ గడ్డపై కాంగ్రెస్ హవా మాత్రమే కొనసాగుతుందని రేవంత్ రెడ్డి కార్యకర్తల సాక్షిగా ప్రకటించారు. విపక్షాల విమర్శలకు తాము చేసే అభివృద్ధే సమాధానం చెబుతుందని, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. రైతు భరోసా రెండో విడత నిధులను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విడుదల చేశారు. 40 లక్షల మంది రైతులకు రైతు భరోసా ఇస్తున్నామని స్పష్టం చేశారు. రైతు సంక్షేమం.. కాంగ్రెస్ నినాదమే కాదు, విధానమని ఉ ద్ఘాటించారు. పంటలకు గిట్టుబాటు ధర తీసుకొచ్చిందే కాంగ్రెస్ అని వ్యాఖ్యానించారు. వరికి రూ.500 బోనస్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని నొక్కిచెప్పారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పర్యటించారు. అక్కడ ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌కు ప్రతిపక్ష హోదా కూడా ఊడగొడతామని హెచ్చరించారు. కాళేశ్వరంలో రూ.లక్ష కోట్లు ముంచారని ఆగ్రహించారు. కేసీఆర్‌కు ఉరి వేసినా తప్పులేదని హెచ్చరించారు. వరుస ఎన్నికల విజయంతో ఆయనకు ఘోరీ కట్టామని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో తేల్చుకుందాం.. దమ్ముంటే రావాలని సవాల్ విసిరారు. ప్రజాపాలనో.. పాపాల భైరవుడో తేల్చుకుందామని వార్నింగ్ ఇచ్చారు. బీఆర్ఎస్ ఘోరీపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. 2034 వరకు కాంగ్రెస్ పాలన కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యకర్తల సాక్షిగా ఇదే తన సవాల్ అని పేర్కొన్నారు. ప్రజాపాలన ఎందుకు పోవాలో మాజీ మంత్రి జీవన్‌రెడ్డి చెప్పాలని ప్రశ్నించారు. పేదలకు సన్నబియ్యం ఇస్తున్నందుకు ప్రజాపాలన పోవాలా? అని నిలదీశారు. కేసీఆర్ డబుల్ బెడ్‌రూమ్ ఇళు ఇచ్చారా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. కేసీఆర్ హయాంలో రూ.20 లక్షల కోట్లు ఖర్చు చేశారు కానీ 20 వేల ఇళ్లు కూడా ఎందుకు కట్టలేదని నిలదీశారు. 4.5 లక్షల ఇళ్లు ఇచ్చినందుకు ప్రజాపాలన పోవాలా? అని ప్రశ్నించారు. జీవన్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వనందుకు ప్రజాపాలన పోవాలా? అని నిలదీశారు. ప్రజాపాలన



పోవాలి.. పాపాల భైరవుడు రావాలని జీవన్‌రెడ్డి అంటున్నారని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజలు గడీల పాలన పోవాలనే కాంగ్రెస్ పాలన తెచ్చుకున్నారని ప్రస్తావించారు. జీవన్‌రెడ్డి మాజీ సీఎం ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి నాదెండ్లతో జతకట్టారని విమర్శించారు. జగిత్యాల కాంగ్రెస్ కార్యకర్తలు జీవన్‌రెడ్డిని పల్లకీపై మోశారని ప్రస్తావించారు. తమ ప్రభుత్వం గడీలకు ఊడిగం చేయాలా? అని ప్రశ్నించారు. గతంలో ఆడబిడ్డలు బతుకమ్మ చీరలు కట్టి పండుగ చేసుకున్నారా? అని నిలదీశారు. కేసీఆర్ హయాంలో పేదలకు సన్నబియ్యం ఇవ్వాలని ఎప్పుడైనా ఆలోచించారా..? అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నల వర్షం కురిపించారు. వాస్తు బాగా లేదని బాగున్న సచివాలయం కూల్చి కొత్తగా కట్టుకున్నారు. బిడ్డ, కొడుకు, తండ్రి ఇలా తలో ఫామ్‌హౌస్ కట్టుకున్నారు. పేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వాలనే ఆలోచన ఏనాడైనా వచ్చిందా?పేదలు.. దొరల గడీల ముందు ఊడిగం చేస్తూ అలాగే ఉండాలని భావించారు. పేదలు కట్టుకోవడానికి పనికిరాని బతుకమ్మ చీరలు పంచారు. వేములవాడకు రూ.100 కోట్లు ఇస్తానని ప్రకటించి.. పదేళ్లలో ఒక్క రూపాయి ఇవ్వలేదు. కేసీఆర్.. నీ ప్రతిపక్ష హోదా ఊడగొట్టకపోతే నా పేరు మార్చుకుంటా. కార్యకర్తల సాక్షిగా ఇదే నా సవాల్. 2029లో నువ్వో.. నేనో తేల్చుకుందాం' అని రేవంత్‌రెడ్డి అన్నారు.



# నీది వ్యభిచార కొంపనా?

**అక్రమ సంపాదనతోనే అహంకారం**

**వెలమల ఆత్మగౌరవంపై దాడి : కేటీఆర్ వ్యాఖ్యలపై సంజయ్ నిప్పులు**

**జగిత్యాల, ఏప్రిల్ 20:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తనను 'క్రాస్ బ్రీడ్' అనడంపై జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సంజయ్ తీవ్రంగా మండిపడ్డారు. కేటీఆర్ వ్యాఖ్యలు ఆయన అక్రమ సంపాదనతో వచ్చిన అహంకారానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. రాజకీయ వ్యభిచారం గురించి మాట్లాడే హక్కు కేటీఆర్‌కు లేదని, గతంలో ఇతర పార్టీల ఎమ్మెల్యేలను బీఆర్ఎస్ లో చేర్చుకున్నప్పుడు ఈ నీతులు ఎటుపోయాయని నిలదీశారు. తాను రాజకీయ వ్యభిచారిని అయితే, మరి కేటీఆర్ వ్యభిచార కొంప నడుపుతున్నారా అని సంజయ్ ప్రశ్నించారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో సొంత పార్టీ అభ్యర్థిని కాదని క్రాస్ ఓటింగ్ చేయించింది కేటీఆర్ కాదా అని అడిగారు. కల్వకుంట్ల కుటుంబ అహంకారం వల్లే రాష్ట్రంలో వెలమ జాతి గౌరవం తగ్గుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేటీఆర్ రాజకీయాల్లోకి రాకముందే తమ కుటుంబం రాజకీయాల్లో ఉందని సంజయ్ గుర్తుచేశారు. ఎమ్మెల్యే అయ్యాక తన ఆస్తులు తగ్గాయే తప్ప పెరగలేదని స్పష్టం చేశారు. అక్రమంగా సంపాదించిన సొమ్ముతో కేటీఆర్ ఇలాంటి విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. తమ కుటుంబ చరిత్ర తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు.

# ఢిల్లీకి బీఆర్ఎస్ త్రిసభ్య కమిటీ

**హరీష్ రావు నేతృత్వంలో పర్యటన**

**సుప్రీంకోర్టు న్యాయవాదులతో భేటీ**



**హైదరాబాద్, ఏప్రిల్ 20:** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు పార్టీకి చెందిన త్రిసభ్య కమిటీ ఢిల్లీకి చేరుకుంది. ఈ బృందంలో మాజీ మంత్రి హరీష్ రావు, మాజీ ఎంపీ వినోద్ కుమార్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఉన్నారు. రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ, న్యాయపరమైన అంశాలపై సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులతో చర్చించడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశం. ఏప్రిల్ 22న తెలంగాణ హైకోర్టులో కాళేశ్వరం కమిషన్ పై తుది తీర్పు వెలువడనుంది. ఈ నేపథ్యంలో తీర్పు ఒకవేళ వ్యతిరేకంగా వస్తే సుప్రీంకోర్టును ఆశ్రయించే అంశాలపై కమిటీ చర్చిస్తోంది. దీనితో పాటు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లోకి చేరిన ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసులో అనుసరించాల్సిన న్యాయ వ్యూహాలపై లాయర్లతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఢిల్లీలో మకాం వేసిన బీఆర్ఎస్ నేతలు నిరంతరం న్యాయ నిపుణులతో భేటీ అవుతున్నారు. హైకోర్టు తీర్పు తర్వాత చేపట్టాల్సిన తదుపరి చర్యలపై ఇప్పటికే ఒక స్పష్టతకు వచ్చినట్లు తెలుస్తోంది. పార్టీ కీలక నేతలు ఢిల్లీ పర్యటనలో ఉండటంతో రాష్ట్ర రాజకీయాల్లో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది.

# జీవన్ రెడ్డి ఒక్కరోజే వీఐపీ

**మునిగే పడవలో మాజీ ఎమ్మెల్యే: ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి**



**హైదరాబాద్, ఏప్రిల్ 20:** బీఆర్ఎస్ భవిష్యత్తు అంధకారమని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. జీవన్ రెడ్డి ఆ పార్టీలో ఒక్కరోజు వీఐపీ మాత్రమేనని ఎద్దేవా చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. బీఆర్ఎస్ మునిగిపోయే పడవని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్‌లో ముసలం మొదలైందని చామల పేర్కొన్నారు. జీవన్ రెడ్డి ఇంటికి కేటీఆర్ వెళ్లినప్పుడు హరీష్ రావు వెళ్లలేదని గుర్తుచేశారు. కేసీఆర్ ఫామ్ హౌస్ నుంచి బయటకు వస్తుంటే.. హరీష్ రావు ఢిల్లీకి ఎందుకు వెళ్లారో చెప్పాలని డిమాండ్ చేశారు. కవిత ఇప్పటికే సొంత పార్టీ పెట్టుకున్నారని ఆరోపించారు. హరీష్ రావు ఢిల్లీలో ఎవరిని కలిశారో త్వరలోనే బయటపడుతుందని ఎంపీ అన్నారు. సొంత పార్టీ నేతలే జీవన్ రెడ్డి చేరికను ఇష్టపడటం లేదని తెలిపారు. మునిగే పడవలో చేరి ఆయన ఏం సాధిస్తారని ప్రశ్నించారు. సీనియర్ల పరిస్థితి ఆ పార్టీలో ఎలా ఉంటుందో అందరికీ తెలుసని చామల విమర్శించారు.

# కేబుల్ బ్రిడ్జిపై బెంజ్ కారు బీభత్సం

**యువకుడు బలి.. పరారైన నిందితులు**

**సీసీ టీవీ దృశ్యాల ఆధారంగా విచారణ**



**హైదరాబాద్, ఏప్రిల్ 20:** హైదరాబాద్‌లోని మాదాపూర్ కేబుల్ బ్రిడ్జిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అతివేగంగా వచ్చిన మెర్సిడెస్ బెంజ్ కారు ఢీకొనడంతో శ్యామ్ రాజ్ (32) అనే వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఆదివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. జూబ్లీహిల్స్ నుంచి ఐకియా వైపు వెళ్తున్న పశ్చిమ బెంగాల్ రిజిస్ట్రేషన్ కలిగిన బెంజ్ కారు.. బ్రిడ్జిపై ఆగి ఉన్న శ్యామ్ రాజ్‌ను బలంగా ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే నిందితులు కారును అక్కడే వదిలి పారిపోయారు. కారు ఇంజిన్ భాగం దెబ్బతినడంతో కొంతదూరం తీసుకెళ్లి బ్రిడ్జిపైనే పార్క్ చేశారు. డ్రైవర్, మరో వ్యక్తి అక్కడి నుంచి తప్పించుకున్నారు. స్థానికులు వెంటనే బాధితుడిని సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి పంపారు. నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. కేబుల్ బ్రిడ్జిపై ఉన్న సీసీ టీవీ ఫుటేజీని పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

# అజహర్ ఎమ్మెల్సీ ఫైల్‌కు గవర్నర్ బ్రేక్?

**పాత కేసులే ఆమోదానికి అడ్డంకి**



**న్యాయ నిపుణుల సమీక్షకు పంపిన గవర్నర్**

- ఏప్రిల్ 30తో ముగియనున్న 6 నెలల గడువు
- మంత్రి పదవి ఊడుతుందనే ఆందోళనలో కాంగ్రెస్
- కోదండరాం పేరుకు లైన్ క్లియర్ అయ్యే ఛాన్స్

**హైదరాబాద్, ఏప్రిల్ 20 :** మంత్రి అజహరుద్దీన్ భవితవ్యం ఇప్పుడు గవర్నర్ నిర్ణయంపైనే ఆధారపడి ఉంది. మంత్రిగా కొనసాగాలంటే ఈ నెల 30లోగా ఆ యన ఎమ్మెల్సీగా ప్రమాణం చేయాల్సి ఉంది. గవర్నర్ కోటాలో ఆయన పేరును ప్రభుత్వం సిఫార్సు చేసినా.. రాజ్‌భవన్ నుంచి ఇంకా ఆమోద ముద్ర పడలేదు. గడువు ముగుస్తున్న తరుణంలో గవర్నర్ అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండటంతో రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. అజహర్ నామినేషన్ ఆమోదించడానికి గవర్నర్ శివప్రతాప్ శుక్లా వెనకాడుతున్నట్లు సమాచారం. గతంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు జరిగిన ఆర్థిక అవకతవకలే దీనికి ప్రధాన కారణం. సుమారు 3.8 కోట్ల రూపాయల కుంభకోణానికి సంబంధించి ఆయనపై ఏసీబీ కేసులు, ఈడీ విచారణలు ఉన్నాయి. ఈ కేసుల్లో ఛార్జ్ షీట్ కూడా నమోదైనట్లు గవర్నర్ కార్యాలయం గుర్తించింది. నేరారోపణలు ఉన్న వారిని నామినేట్ చేయడంపై గవర్నర్ ఆచి తూచి అడుగులు వేస్తున్నారు. అజహర్ పై ఉన్న కేసుల తీవ్రతను బట్టి గవర్నర్ ఈ ఫైల్‌ను న్యాయ నిపుణుల సమీక్షకు పంపారు. ఆర్థిక నేరాల ఆరోపణలు ఉన్న వ్యక్తిని నేరుగా ఎమ్మెల్సీగా నియమించడంపై ఉన్న చట్టపరమైన సాధ్యా సాధ్యాలను పరిశీలిస్తున్నారు. మరోవైపు కోదండరాం పేరు పై గవర్నర్ సానుకూలంగా ఉన్నట్లు సమాచారం. అయితే ఇద్దరి పేర్లను ఒకేసారి ఆమోదించాలా లేక అజహర్ ఫైల ను పక్కన పెట్టి కోదండరాం పేరునే ఖరారు చేయాలా అనే సందిగ్ధత నెలకొంది. గడువు సమీపిస్తుండటంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగారు. ఆదివారం గవర్నర్‌ను కలిసి అజహర్, కోదండరాం పేర్లను తక్షణమే ఆమోదించాలని కోరారు. ప్రభుత్వం తరపున పూర్తి వివరణ ఇచ్చినా గవర్నర్ ఇంకా స్పష్టత ఇవ్వలేదు. ఒకవేళ ఏప్రిల్ 30లోగా ఆమోదం రాకపోతే అజహర్ మంత్రి పదవికి రాజీనామా చేయక తప్పని పరిస్థితి ఏర్ప డుతుంది. ప్రస్తుతం ఈ బంతి గవర్నర్ కోర్టులోనే ఉంది.

# రేవంత్ సభపై కేసీఆర్ కుట్ర

**కావాలనే పోటీ సభలు పెట్టిన బీఆర్ఎస్**

**ఫామ్ హౌస్ కే పరిమితమైన పులి**

**పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్**



**హైదరాబాద్, ఏప్రిల్ 20:** సీఎం రేవంత్ రెడ్డి రైతు సభకు పోటీగానే కేసీఆర్ జగిత్యాల సభ ఏర్పాటు చేశారని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. రేవంత్ సభ 20 రోజుల ముందే ఖరారైందని ఆయన గుర్తు చేశారు. కేసీఆర్ కు అబద్ధాలు చెప్పడం, ప్రజలను మభ్యపెట్టడం అలవాటేనని విమర్శించారు. జీవన్ రెడ్డికి కేసీఆర్ మాయమాటలు చెబుతున్నారని మహేష్ గౌడ్ ఎద్దేవా చేశారు. గతంలో కేసీఆర్ చేసిన మోసాలను మాకు పాఠాలుగా చెప్పిన జీవన్ రెడ్డి.. ఇప్పుడు అదే పార్టీకి వత్తాసు పలకడం విడ్డూరంగా ఉందన్నారు. కేకే, డీఎస్ లాగే జీవన్ రెడ్డి కూడా భవిష్యత్తులో బాధపడతారని వ్యాఖ్యానించారు. కేసీఆర్ అనే పులి ఇప్పుడు ఫామ్ హౌస్ కే పరిమితమైందని మహేష్ గౌడ్ దుయ్యబట్టారు. ప్రాజెక్టుల పేరుతో ప్రజలను దోచుకున్న వారి వివరాలను త్వరలోనే బయటపెడతామని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి పాలనను ప్రజలు కోరుకుంటున్నారని, మార్పు రావాలని కోరుకునే హక్కు జీవన్ రెడ్డికి ఎక్కడిదని నిప్పులు చెరిగారు.



# సంగారెడ్డిలో క్యాత్ ల్యాబ్

**ప్రారంభించిన మంత్రి దామోదర రాజనర్సింహా**

**సంగారెడ్డి, ఏప్రిల్ 20:** సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని సన్ రైజ్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన క్యాత్ ల్యాబ్ (గుండె సంబంధ చికిత్స) విభాగాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ విభాగాలను ఆయన స్వయంగా పరిశీలించారు. రోగులకు అందుతున్న సదుపాయాల గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లా వేగంగా మెడికల్ హబ్ గా అభివృద్ధి చెందుతోందని హర్షం వ్యక్తం చేశారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు. అత్యాధునిక వైద్య పరికరాలు స్థానికంగా అందుబాటులోకి రావడం వల్ల ప్రజలకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మాధురి, ఆసుపత్రి మేనేజ్‌మెంట్ స్వామి గౌడ్, కాంగ్రెస్ యువజన విభాగం అధ్యక్షుడు పెద్దపట్ల వినయ్ గౌడ్ పాల్గొన్నారు. వీరితో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బంది ఈ ప్రారంభోత్సవంలో భాగస్వామ్యమయ్యారు.

# రాష్ట్రాన్ని దోచుకున్నారు!

**సొంత పార్టీలోనే ఆయనకు గౌరవం లేదు**

**ప్రాజెక్టుల రీడిజైన్ అంతా అవినీతే**

**రుణమాఫీతో రేవంత్ రెడ్డి రికార్డు**

**హరీష్ రావుపై తుమ్మల ధ్వజం**

**ఖమ్మం, ఏప్రిల్ 20:** గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో తెలంగాణను నాశనం చేశారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మండిపడ్డారు. వ్యవస్థలను దోచుకుంటూ రాష్ట్రాన్ని రావణకాష్టం చేశారని ధ్వజమెత్తారు. సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. మాజీ మంత్రి హరీష్ రావుపై నిప్పులు చెరిగారు. పదవి పోయిన బాధలో, ఉనికి కోసమే హరీష్ రావు పసలేని విమర్శలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. బిఆర్ఎస్ పార్టీలో హరీష్ రావుకు భవిష్యత్తు లేదని తుమ్మల విమర్శించారు. వరంగల్ సభలో కనీసం ఆయన ఫోటో కూడా పెట్టలేదని, పక్కన పెట్టేశారని గుర్తు చేశారు. పార్టీలో జరుగుతున్న అవమానాల వల్ల హరీష్ రావు మానసిక వేదన అనుభవిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఎక్కడికి వెళ్లినా పాత రికార్డునే ప్లే చేస్తున్నారని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కేవలం కమిషన్ల కోసమే ప్రాజెక్టు డిజైన్లు మార్చారని తుమ్మల ఆరోపించారు. సీతారామ ప్రాజెక్టును తమ ప్రభుత్వం వేగంగా పూర్తి చేస్తోందని తెలిపారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం 21 వేల కోట్లతో రుణమాఫీ చేసి రైతులకు అండగా నిలిచిందని స్పష్టం చేశారు. హరీష్ రావు ఆరోగ్య మంత్రిగా ఉన్నప్పుడు సిఎంఆర్ఎఫ్ నిధులను కూడా వదల్లేదని, దళిత బంధులోనూ దోపిడీ చేశారని దుయ్యబట్టారు. ప్రజలు వారి అక్రమాలను గుర్తించే బుద్ధి చెప్పారని, ఇకపై వారు అధికారంలోకి రావడం అసాధ్యమని తేల్చి చెప్పారు.



# మేధావుల మౌనం సమాజానికి అరిష్టం

- డీలిమిటేషన్, మహిళా బిల్లుపై గళమెత్తాలి..
- కాంగ్రెస్ కుట్రలను తిప్పికొట్టాలి
- అంబేద్కర్ ఆశయాలను అమలు చేస్తున్నది మోదీ ప్రభుత్వమే!
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్




**కరీంనగర్:** దేశ పురోగతికి కీలకమైన డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన), మహిళా రిజర్వేషన్ బిల్లుల విషయంలో మేధావులు తమ మౌనాన్ని వీడాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. సమాజంలో జరుగుతున్న మంచి చెడులపై నిష్కర్షగా మాట్లాడాల్సిన బాధ్యత మేధావులపై ఉందని, వారి మౌనం సమాజానికి ఏమాత్రం శ్రేయస్కరం కాదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా కరీంనగర్‌లోని శుభమంగళ కన్వెన్షన్‌లో నిర్వహించిన 'మేధావుల సదస్సు'లో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. అంబేద్కర్ కేవలం ఒక వర్గానికో, పార్టీకో పరిమితమైన నాయకుడు కాదని, అణగారిన వర్గాల వెలుగురేఖ అని బండి సంజయ్ కొనియాడారు. "అంబేద్కర్ బీజేపీ నాయకుడు కాకపోయినా, ఆయన ఆశయాలను గల్లీగల్లీకి తీసుకెళ్తున్నది మోదీ ప్రభుత్వమే. చాయ్ వాలా ప్రధాని అయ్యారంటే అది అంబేద్కర్ పెట్టిన భిక్ష అని మోదీ గారే స్వయంగా ప్రకటించారు" అని గుర్తు చేశారు. అంబేద్కర్ జన్మించిన, చదువుకున్న, నివసించిన ప్రాంతాలను 'పంచ తీర్థాలు'గా అభివృద్ధి చేసి గౌరవించింది బీజేపీ ప్రభుత్వమేనని ఆయన స్పష్టం చేశారు. చరిత్రలో అంబేద్కర్‌ను అడుగడుగునా అవమానించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని బండి సంజయ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "ఆర్టికల్ 370ని అంబేద్కర్ వ్యతిరేకిస్తే నెహ్రూ బలవంతంగా రుద్దారు. హిందూ కోడ్ బిల్లు ద్వారా మహిళలకు ఆస్తి హక్కు, రిజర్వేషన్లు కల్పించాలని కోరితే కాంగ్రెస్ అడ్డుకుంది. చివరకు ఆయనను పార్లమెంటుకు వెళ్లకుండా కుట్ర చేసి ఓడించారు. ఆయన మరణిస్తే అంత్యక్రియలకు ఢిల్లీలో రెండు గజాల స్థలం కూడా ఇవ్వని నీచ చరిత్ర కాంగ్రెస్ ది" అని మండిపడ్డారు. నెహ్రూ, ఇందిరా గాంధీలు తమకు తాము భారతరత్న ఇచ్చుకున్నారని, కానీ అంబేద్కర్‌కు బీజేపీ మద్దతు ఉన్న ప్రభుత్వమే ఆ గౌరవాన్ని దక్కించిందని గుర్తు చేశారు. మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ బిల్లులు అంబేద్కర్ ఆలోచనల్లో భాగమేనని, వీటిని అమలు చేయడానికి మోదీ ప్రభుత్వం సిద్ధంగా ఉంటే కాంగ్రెస్ కూటమి అడ్డుకుంటోందని బండి సంజయ్ ఆరోపించారు. "సోనియా, ప్రియాంక, కనిమొళి, సుప్రియా సూలె వంటి వారసత్వ నాయకులకు పదవులు దక్కితేనే మహిళలకు న్యాయం జరిగినట్లా? సామాన్య మహిళలు చట్టసభల్లో అడుగుపెట్టకూడదా?" అని నిలదీశారు. సీట్లు పెంచితే దక్షిణాది రాష్ట్రాలకు అదనపు ప్రాతినిధ్యం దక్కుతుందని, కొత్త రక్తం రాజకీయాల్లోకి వస్తుందని ఆయన వివరించారు. రాజకీయాలతో సంబంధం లేకుండా సమాజ హితం కోరే మేధావులు, డీలిమిటేషన్ మరియు మహిళా బిల్లు వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని కేంద్ర మంత్రి కోరారు. సోషల్ మీడియా, సదస్సుల ద్వారా ప్రజల్లో చైతన్యం తేవాలని చేతులెత్తి విన్నవించారు. అట్టడుగు వర్గాలకు ఆర్థిక, సామాజిక సమానత్వం దక్కేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్న మోదీ ప్రభుత్వానికి అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సదస్సులో కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, దళిత మోర్చా అధ్యక్షులు సోమిడి వేణు, పలువురు మేధావులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# దక్షిణ కొరియా ద్వైపాక్షిక సంబంధాలు బలోపేతం

- అధ్యక్షుడు లీ జె మ్యూంగ్‌తో ప్రధాని

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 20:** భారత్, దక్షిణ కొరియా మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలపడుతున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యూంగ్ మూడు రోజుల పర్యటన కోసం భారత్ వచ్చారు. ఇరు దేశాల మధ్య సోమవారం పలు ఒప్పందాలు కుదిరాయి. అనంతరం నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో ప్రధాని మోదీ మాట్లాడారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల్లో ఇది కీలక ముందడుగు అని అన్నారు. భారత్, దక్షిణ కొరియా మధ్య సంబంధాలు కేవలం వాణిజ్యానికి మాత్రమే పరిమితం కాకుండా టెక్నాలజీ, రక్షణ, షిప్ బిల్డింగ్, ఎనర్జీ వంటి విభిన్న రంగాల్లో విస్తరిస్తున్నాయని ప్రధాని పేర్కొన్నారు. చిప్స్ నుంచి షిప్స్ వరకు, ట్యాలెంట్ నుంచి టెక్నాలజీ వరకు, ఎంటర్‌టైన్‌మెంట్ నుంచి ఎనర్జీ వరకు.. ఇలా వివిధ రంగాల్లోని అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా దక్షిణ కొరియాతో భాగస్వామ్యం చేసుకుంటున్నట్టు తెలిపారు. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య సుమారు 27 బిలియన్ డాలర్లుగా ఉన్న వాణిజ్యాన్ని 2030 నాటికి 50 బిలియన్ డాలర్లకు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ప్రధాని తెలిపారు. ఈ సమావేశంలో పలు కీలక ఒప్పందాలు కూడా కుదిరాయి. ముఖ్యంగా పారిశ్రామిక రంగం, టెక్నాలజీ, ఎనర్జీ, క్రిటికల్ మినరల్స్ వంటి రంగాల్లో పరస్పరం సహకరించుకునేందుకు ఇరు దేశాలు అంగీకరించాయి.



అలాగే ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం కోసం రెండు దేశాలు కలిసి పనిచేస్తాయని మోదీ తెలిపారు.

## చమురు ధరలు దిగిరావచ్చు

### యూఎస్ ఇంధన శాఖ మంత్రి క్రిస్‌రైట్

**వాషింగ్టన్, ఏప్రిల్ 20:** యూఎస్, ఇరాన్ మధ్య రాజీ కుదరకపోవచ్చున్న భయాలతో చమురు ధరల మళ్లీ పెరగడం మొదలెట్టాయి. ఈ నేపథ్యంలో అమెరికా ఇంధన శాఖ మంత్రి క్రిస్‌రైట్ కీలక వ్యాఖ్యలు చేశారు. యూఎస్‌లో ఇంధన ధరలు ఇప్పటికే గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయని అన్నారు. అయితే, వచ్చే ఏడాది వరకూ గ్యాలన్ పెట్రోల్ ధరలు 3 డాలర్లకు పైబడే ఉండవచ్చని అన్నారు. 'ధరలు ఇప్పటికే పతాకస్థాయికి చేరుకున్నాయి. కాబట్టి ఇక తగ్గడం మొదలు కావచ్చు. ఈ ఏడాది చివర్లో లేదా వచ్చే ఏడాదికి కానీ ధరలు దిగిరాకపోవచ్చు' అని తాజాగా ఒక మీడియా సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పేర్కొన్నారు. యుద్ధానికి ముగింపు పడితే ధరలు సహజంగానే తగ్గుముఖం పడతాయని అన్నారు. ప్రభుత్వ వర్గాలు మాత్రం ఇందుకు భిన్నమైన వాదనను వినిపిస్తున్నాయి. గ్యాలన్ పెట్రోల్ ధర 3 డాలర్ల కంటే దిగువకు చేరుకుంటుందని అన్నారు.



## సంపాదకీయం

# కవిత పార్టీతో బీఆర్‌ఎస్‌కే దెబ్బ!

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కొత్తపార్టీ ప్రకటన మరో నాలుగు రోజుల్లో రానుంది. ఆమె దూకుడు గా రాజకీయాలు నెరపుతున్నారు. టీఆర్ఎస్ పార్టీ పేరు ఖాళీగా ఉంది కనుక దానిని ఎవరైనా వాడుకో వచ్చని అన్నారు. అయితే ఈ నెల 25న ఆమె పార్టీ ప్రకటించనున్నారు. అప్పుడే పార్టీ పేరు ఏంటన్నది తెలుస్తుంది. ఈలోగా చేరికలను ప్రోత్సహిస్తున్నారు. దళితులు, ఆదివాసీలు, బీసీలు లక్ష్యంగా ఆమె చేరికలను ప్రోత్సహిస్తున్నారు. ఇకపోతే టీఆర్ఎస్ పార్టీని పునరుద్ధరించే ఆలోచన ఉన్నట్లు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ ఇటీవల ప్రకటించారు. దీంతో ఇప్పుడు టిఆర్ఎస్ కవితకు దక్కిందా లేదా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. అయితే ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే తెలంగాణ ఏర్పడ్డ తర్వాత రెండు పర్యాయాలు అధికారం దక్కడంతో అహంకారంతో విర్రవీగడం, ప్రజలను కావాలనే దూరం పెటట్డం, సిఎం ప్రజలను కలవాల్సిన పనిలేదని చెప్పడం లాంటివన్నీ ప్రజలు గమనించారు. బుద్ధి చెప్పాలన్న నిర్ణయానికి వచ్చిన ప్రజలు కెసిఆర్‌ను ఓడించారు. ఎపిలో కూడా జగన్ ఇలాగే నిరంకుశంగా పాలించారు. సొంత డబ్బా కొట్టుకోవడం, సొంత ప్రయోజాలే పాలనగా చూడడం, మద్యం, ఇసుక, మట్టి మాఫియాలు పెరగడం వంటి కారణాలన్నీ తోడయ్యాయి. ప్రజాధనంతో విశాఖలో ఇంద్రభవనాలు కట్టుకోవడం వంటివన్నీ ఎదురుదెబ్బతీసాయి. అందుకే 11 సీట్లకే పరిమితం చేశారు. పాలకులు ఒళ్లు దగ్గరపెట్టుకుని పాలించాలి. తెలంగాణలో ఇప్పుడు రేవంత్ రెడ్డి, ఆయన మంత్రివర్గ సహచరులు కూడా ఇదేవిధంగా పనిచేస్తున్నారు. పైకి ప్రజాపాలన అని చెప్పి ప్రకటనలు చేయడం తప్ప, ఒక్క అభివృద్ధి పని జరగడం లేదు. ఇది రేవంత్ కూడా గుర్తించాలి. లేకుంటే కాంగ్రెస్ పార్టీకి కూడా ఇదే గతి పడుతుంది. ఇకపోతే అపర చాణక్యుడిగా పేరొందిన కేసీఆర్ 2023 ఎన్నికల్లో ఓడిపోయాక కనసీం అసెంబ్లీకి రావడం లేదు. ప్రజల్లోకి రావడం లేదు. ఠంచన్‌గా జీతాలు మాత్రం పొందుతున్నారు. ఈ క్రమంలో పార్టీ పేరును మళ్లీ తెలంగాణ రాష్ట్ర సమితిగా మార్చే విషయం పరిశీలిస్తున్నామని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పుకొచ్చారు. టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చాలనుకున్నప్పుడు అది సరైన నిర్ణయం కాదని వచ్చిన విమర్శలను పట్టించుకోలేదు. సరికదా జాతీయ పార్టీగా ప్రకటించి పలు రాష్ట్రాల్లో ఊరేగారు. తెలంగాణ రాష్ట్ర సమితిని భారత రాష్ట్ర సమితిగా మార్చాలనుకోవడం ఆత్మహత్యాసదృశం అవుతుందని వచ్చిన హెచ్చరికలను పెడచెవిన పెట్టారు. తెలంగాణ అన్న పేరుకు దూరమవడం తెలివి తక్కువ నిర్ణయమని గుర్తించలేకపోయారు. పార్టీలోని మెజారిటీ నాయకులు కూడా ఇదే అభిప్రాయంతో ఉండేవారు. అయితే ఎవరూ నోరు విప్పడానికి సాహసించలేకపోయారు. భిన్నాభిప్రాయాలను కేసీఆర్ ప్రోత్సహించేవారు కాదు. ఎవరు కూడా ఆయన నిర్ణయాలను నిలదీసే ధైర్యం చేసేవారు కాదు. ఇది పార్టీలో ప్రజాస్వామ్యాం లేదనడానికి నిదర్శనం. కెసిఆర్ చెప్పిందే వేదం అన్నట్లుగా పార్టీ నడిచింది. ప్రాంతీయ పార్టీల్లో ఇది సహజమే అయినా ఆలోచనలను పంచుకోవాలి. కేసీఆర్‌లో అపర చాణుక్యుడని, అనేక తెలివితేటలు ఉన్నాయని, ఆయన వేసే రాజకీయ ఎత్తుగడలకు తిరుగుండదని, ఆయన ఎలా చెబితే అలాగే జరుగు తుందని నమ్మే స్థితికి పార్టీ నేతలు వచ్చారు. ఈ కారణంగానే తెలంగాణ రాష్ట్ర సమితిని జాతీయ పార్టీగా విస్తరించి భారత రాష్ట్ర సమితి పేరిట ఇతర రాష్ట్రాలలో కూడా పోటీ చేసి తగినన్ని సీట్లు గెలుచుకొని కేంద్రంలో చక్రం తిప్పుతానని కేసీఆర్ పెద్ద ఎత్తున ప్రచారం చేసుకున్నారు. ఇతర ప్రాంతీయ పార్టీల నాయకులను కలిసి తనకుతాను అతిపెద్ద నాయకుడిగా ఊహించుకున్నారు. జాతీయ రాజకీయాల పేరుతో నేల విడిచి సాము చేసిన కెసిఆర్ బొక్కబోర్లా పడ్డారు. తెలంగాణను బాగుచేయకుండా, అవినీతికి గేట్లు తెరిచి, జాతీయ రాజకీయాలు అంటూ కేసీఆర్ ఊరేగడాన్ని తెలంగాణ సమాజం కూడా హర్షించలేదు. ఫలితంగానే 2023లో కెసిఆర్ ఓడించారు. పార్టీలో సమష్టి నిర్ణయాలు, ఆలోచనలకు తావులేకుండా చేయడం వల్లనే కేసీఆర్ రాజకీయంగా దెబ్బతిన్నారు. దీనికితోడు తెలంగాణ ఉద్యమంతో సంబంధం ఉన్న వారిని బయటకు తరిమేశారు. తమకు తిరుగు లేకుండా చూసుకున్నారు. పార్టీలో పోరాటం చేసిన వారెవరూ లేకుండా చేయడం వల్లనే బీఆర్ఎస్‌కు ప్రస్తుత దుస్థితి ఏర్పడింది. తండ్రీ, తనయులదే పెత్తనంగా సాగింది. ఇద్దరు నేతల్లో నియంతృత్వ పోకడలు పెరగడంతో సమష్టి నిర్ణయాలకు ఆస్కారం లేకుండా పోయింది. అధికారంలో ఉన్నప్పుడు తప్పులు చేశామని ఇంత కాలానికి కేటీఆర్ అంగీకరించారు. ఇదొక శుభ పరిణామం. అధికారంలో ఉన్నప్పుడు అహంకారంతో, అతిశయంతో వ్యవహరించిన వారికి గుణపాఠాలు తప్పవు. ఎన్టీఆర్ అంతటి నాయకుడు కూడా ఎన్నికల్లో ఓడిపోయారు. ఈ ఉదంతాలు తెలిసి కూడా కేసీఆర్ అదే బాటలో అహంభావంతో వ్యవహరించారు. నేల విడిచి సాము చేశారు. పరాజయం మూటగట్టుకున్నారు. ఏ పార్టీకైనా బలమైన నాయకుడు ఎంత ముఖ్యమో స్వతంత్రంగా ఆలోచించి ప్రజాభిప్రాయాన్ని అధినాయకుడికి నిక్కచ్చిగా చెప్పగలిగిన నాయకులు కూడా అంతే అవసరం. కేవలం కొడుకు, అల్లుళ్లను పట్టుకుని వేలాడడం వల్లనే ఈ దుస్తితి ఏర్పడింది. కూతరు కవిత బయటకు పోయింది. ఆమె పార్టీ పెడితే మొదట దెబ్బతినేది కూడా బిఆర్ఎస్ అని గుర్తించాలి.

## జమ్ముకాశ్మీర్‌లో ఘోర ప్రమాదం

### బస్సు బోల్తాపడి 15మంది మృతి



**శ్రీనగర్, ఏప్రిల్ 20:** జమ్మూ కాశ్మీర్ కాగోర్ట్ సమీపంలోని రామ్‌నగర్- ఉదంపూర్ జాతీయ రహదారిపై బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 15 మంది ప్రయాణికులు మరణించారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్య చికిత్స కోసం వారిని ఉదంపూర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. ఈ ప్రమాద ఘటనపై సమాచారం అందుకోగానే జిల్లా ఉన్నతాధికారులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అతివేగం కారణంగా బస్సు డ్రైవర్ నియంత్రణ కోల్పోవడమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని ప్రత్యక్ష సాక్ష్యులు వెల్లడించారు. సోమవారం రామ్‌నగర్ నుంచి ఉదంపూర్ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాద ఘటనపై ఉదంపూర్ జిల్లా ఉన్నతాధికారులతో స్థానిక ఎంపీ, కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ స్వయంగా ఫోన్ చేసి మాట్లాడారు. ఈ ప్రమాదంపై ఆయన ఆరా తీశారు. క్షతగాత్రులను మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. తీవ్రంగా గాయపడిన వారికి అత్యవసర వైద్య సహాయం కోసం ఎయిర్ అంబులెన్స్ ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. మరోవైపు జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఈ ప్రమాద ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధితులకు సాధ్యమైన మేరకు అన్ని సహాయ సహకారాలు అందించాలని జిల్లా ఉన్నతాధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. ఈ మేరకు ఎక్స్ ఖాతా ద్వారా కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా స్పందించారు.








## ఇరాన్- అమెరికా శాంతి చర్చల్లో ప్రతిష్టంభన

### చర్చలకు రావడం లేదని తేల్చిన ఇరాన్

**టెహ్రాన్, ఏప్రిల్ 20:** పాకిస్థాన్ వేదికగా అమెరికా-ఇరాన్ మధ్య సోమవారం జరగాల్సిన రెండో దఫా శాంతి చర్చలు ఆగిపోయాయి. చర్చలకు రావడం లేదని ఇరాన్ స్పష్టం చేసింది. యూఎస్ నౌకాదళం తమ కార్గో షిప్‌ను స్వాధీనం చేసుకోవడంతో తీవ్ర ఆగ్రహానికి గురైన ఇరాన్ శాంతి చర్చల్లో పాల్గొనేది లేదని తేల్చి చెప్పింది. 22వ తేదీతో అమెరికా-ఇరాన్ మధ్య రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం ముగియనుంది. కాల్పుల విరమణ ఒప్పందం గడువు ముగిసే లోపు అమెరికా-ఇరాన్ మధ్య ఇస్లామాబాద్ వేదికగా శాంతి నెలకొంటుందని చాలా దేశాలు భావించాయి. అయితే ప్రపంచ దేశాల ఆశలు ఫలించలేదు. అమెరికా వైఖరి కారణంగానే శాంతి చర్చలకు వెళ్లడం లేదని టెహ్రాన్ పేర్కొంది. ఇరాన్ జెండాతో ఉన్న వాణిజ్య నౌక తౌస్కాను అమెరికా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. నౌకపై తొలుత కాల్పులు జరిపి ఆపై అదుపులోకి తీసుకున్నాయి . అమెరికా తమ నౌకను స్వాధీనం చేసుకోవడంపై ఇరాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది . ఈ చర్యను ఇరాన్‌పై దాడిగా భావిస్తూ త్వరలోనే ప్రతీకారం తీసుకుంటామని హెచ్చరించింది. అమెరికా చర్యలు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడమేనని, ఇస్లామాబాద్‌లో మలి విడత చర్చలకు రావడం లేదని ఇరాన్ తెలిపింది. అలాగే ఇరాన్ నౌకాశ్రయాలపై అమెరికా దిగ్బంధనం కొనసాగించడం, శాంతి చర్చల నేపథ్యంలో అగ్రరాజ్యం పెట్టిన డిమాండ్లు కూడా ఇరాన్‌కు రుచించడం లేదు. ఈ నేపథ్యంలో రెండో దఫా శాంతి చర్చలు ప్రారంభం కాకుండానే విఫలమైనట్టు కనిపిస్తోంది.

# హార్మ్యూజ్ దాటొద్దు

- భారత నౌకలకు నేవీ 'రెడ్ అలర్ట్'!
- ఇరాన్ కాల్పుల నేపథ్యంలో అడ్వైజరీ..
- అనుమతి వచ్చే వరకు నిలపాలని ఆదేశం



**న్యూఢిల్లీ:** హర్మ్యూజ్ జలసంధిలో ఉద్రిక్తతలు పరాకాష్టకు చేరడంతో భారత నౌకాదళం (ఇండియన్ నేవీ) అత్యవసర హెచ్చరికలు జారీ చేసింది. భారత పతాకంతో ప్రయాణిస్తున్న నౌకలపై ఇరాన్ బలగాలు కాల్పులు జరిపిన ఘటనను తీవ్రంగా పరిగణించిన నేవీ, తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ఆ జలసంధి వైపు వెళ్లొద్దని నౌకలకు స్పష్టం చేసింది. ముఖ్యంగా లారక్ ఐలాండ్‌కు దూరంగా ఉండాలని సూచించింది. దేశ భద్రత మరియు వాణిజ్య ప్రయోజనాల దృష్ట్యా ఈ అడ్వైజరీ జారీ చేసినట్లు రక్షణ వర్గాలు వెల్లడించాయి. ఇటీవల 'జగ్ అర్ణవ్', 'సన్మార్ హెరాల్డ్' అనే రెండు భారత నౌకలు హర్మ్యూజ్ జలసంధి గుండా ప్రయాణిస్తుండగా ఇరాన్ బలగాలు వాటిని లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరిపాయి. ఈ ఘటనపై భారత విదేశాంగ శాఖ ఇప్పటికే తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఢిల్లీలోని ఇరాన్ రాయబారి మహమ్మద్ ఫతాలీని పిలిపించి ప్రభుత్వం గట్టి హెచ్చరికలు జారీ చేసింది. గతంలో ఇరాన్ నౌకల ప్రయాణానికి సహకరించిందని, కానీ ప్రస్తుత తీరు సరికాదని భారత్ స్పష్టం చేసింది. హోర్ముజ్ జలసంధిని చివరిగా 'దేశ్ గరిమ' అనే ట్యాంకర్ సురక్షితంగా దాటినట్లు సమాచారం. హర్మ్యూజ్ జలసంధి దిగ్బంధంతో చమురు సరఫరాకు ఆటంకం కలగకుండా కేంద్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ఇరాన్ మార్గానికి బదులుగా రష్యా నుంచి దిగుమతులు పెంచుకునేందుకు మార్గం సుగమం చేసింది. ఇందులో భాగంగా 11 రష్యా బీమా సంస్థలకు భారత్‌లో సేవలు అందించేందుకు అనుమతులు మంజూరు చేసింది. గ్యాస్‌ప్రోమ్ ఇన్స్యూరెన్స్, రోస్‌గోస్‌ట్రాక్, స్బెర్‌బ్యాంక్ వంటి సంస్థలు ఈ జాబితాలో ఉన్నాయి. సాధారణంగా అంతర్జాతీయంగా ప్రాచుర్యం పొందిన 'పీ అండ్ ఐ క్లబ్స్' రష్యా నౌకలకు బీమా ఇవ్వవు కాబట్టి, భారత ప్రభుత్వమే నేరుగా రష్యా సంస్థలకు అనుమతినిస్తూ సాహసోపేత నిర్ణయం తీసుకుంది. హర్మ్యూజ్ జలసంధిలో ఇరాన్-అమెరికా మధ్య నెలకొన్న ఉద్రిక్తతల వల్ల చమురు రవాణా అగిపోయే ముప్పు ఉంది. అయితే, రష్యా నుంచి వచ్చే నౌకలు ఎర్ర సముద్రం మీదుగా ఆసియాకు చేరుకునే అవకాశం ఉండటంతో భారత్ మాస్కో వైపు మొగ్గు చూపుతోంది. రష్యా నుంచి చమురు కొనుగోళ్లకు అమెరికా ట్రెజరీ డిపార్ట్‌మెంట్ కూడా అనుమతులను పొడిగించడం భారత్‌కు కలిసివచ్చే అంశం. ఏది ఏమైనా, అంతర్జాతీయ ఉద్రిక్తతల మధ్య దేశీయంగా ఇంధన కొరత తలెత్తకుండా కేంద్రం వేగంగా అడుగులు వేస్తోంది.

# గజ్వేల్ మున్సిపాలిటీలో అవినీతి రాజ్యసభ


## లంచం లేనిదే కదలని ఫైళ్లు



**నేటి సాక్షి,గజ్వేల్ :** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ కార్యాలయం ప్రజాసేవ కేంద్రంగా కాకుండా లంచాల వసూలు అడ్డాగా మారిందని పట్టణ ప్రజలు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. కిందిస్థాయి ఉద్యోగి నుండి పైస్థాయి అధికారుల వరకు అవినీతి పరంపర కొనసాగుతోందని, ఏ చిన్న పని కావాలన్నా అధికారుల జేబులు నింపాల్సిందేనని బాధితులు ఆరోపిస్తున్నారు. అన్ని అనుమతులు ఉన్నా ఇంటి నెంబర్ కేటాయించడానికి రూ. 40,000 వరకు డిమాండ్ చేస్తున్నారని, చివరకు రేకుల షెడ్లకు నెంబర్లు ఇవ్వడానికి కూడా లక్షల్లో వసూళ్లకు పాల్పడుతున్నారని పట్టణంలో జోరుగా చర్చ సాగుతోంది.

### అక్రమ నిర్మాణాలకు మౌన అనుమతులు

పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా వెలుస్తున్న బహుళ అంతస్తుల భవనాలపై అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బిల్డర్ల నుండి భారీగా 'మామూళ్లు' అందుతుండటంతో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సామాన్యుడు చిన్న ఇల్లు కట్టుకుంటే అడుగడుగునా అడ్డంకులు సృష్టించే అధికారులు, ధనవంతుల అక్రమ నిర్మాణాలకు మాత్రం గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారని




'పేదవాడికి చట్టం.. ధనవంతుడికి సౌకర్యం' అన్నట్లుగా మున్సిపాలిటీ తీరు ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### అసెస్మెంట్ నెంబర్ల పేరిట అక్రమాలు

మున్సిపల్ రికార్డుల్లో అసెస్మెంట్ నెంబర్ల మార్పిడిలో భారీ అక్రమాలు జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒక నిరుపేద దళిత కుటుంబానికి చెందిన స్థలాన్ని రాజకీయ నాయకులు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుంటే, అక్కడ ఇల్లు ఉన్నట్లుగా రికార్డులు సృష్టించడానికి అధికారులు లక్ష రూపాయల వరకు లంచం తీసుకున్నట్లు సమాచారం. అలాగే వారసత్వ ఆస్తుల మార్పిడి (మ్యూటేషన్) కోసం వచ్చే వారి నుండి వేల రూపాయలు వసూలు చేస్తూ ప్రజల అవసరాన్ని అధికారులు సొమ్ము చేసుకుంటున్నారు.

### ఉన్నతాధికారులు స్పందించాలి

గతంలో ఆదర్శంగా ఉన్న గజ్వేల్ మున్సిపాలిటీ ఇప్పుడు అవినీతికి నిలయంగా మారిందని పట్టణవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం మరియు మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి ఇక్కడ జరుగుతున్న లంచాల దందాను అరికట్టాలని కోరుతున్నారు. అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న అధికారులపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని, సామాన్య ప్రజలకు ఇబ్బంది కలగకుండా పారదర్శకమైన సేవలు అందించాలని గజ్వేల్ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# గజ్వేల్‌లో ఘనంగా బసవేశ్వర జయంతి వేడుకలు

- బసవన్న బోధనలు సమాజానికి మార్గదర్శకం: నేతల కొనియాడింపు



**నేటి సాక్షి,గజ్వేల్ :** కులవ్యవస్థ లేని సమాన సమాజ నిర్మాణం కోసం కృషి చేసిన సామాజిక విప్లవకారుడు, లింగాయత్ సంప్రదాయ వ్యవస్థాపకుడు మహాత్మా బసవేశ్వరుని జయంతి వేడుకలను గజ్వేల్ పట్టణంలో వీరశైవ లింగ బలిజ సమాజం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని బసవేశ్వర విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు, సంఘం సభ్యులు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ చందన, ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఏఎంసీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ పాల్గొని ప్రసంగించారు. 12వ శతాబ్దంలోనే బసవన్న 'అనుభవ మంటపం' ద్వారా ప్రజాస్వామ్యానికి, సమానత్వానికి పునాదులు వేశారని వారు కొనియాడారు. శ్రమకు గౌరవం ఇవ్వాలని, స్త్రీ పురుష విభేదాలు లేని సమాజాన్ని నిర్మించాలని ఆయన చాటిన బోధనలు నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. అనంతరం వీరశైవ లింగ బలిజ సమాజ నాయకులు మాట్లాడుతూ.. బసవన్న ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జంగం శివకుమార్, నవీన్ కుమార్, గౌరవ అధ్యక్షులు ఆకుల మల్లప్ప, అధ్యక్షులు కాచం వీరేశం, ఉపాధ్యక్షులు అమరాది ప్రభాకర్, జూకంటి ప్రభాకర్, కొత్తపల్లి శ్యాం కుమార్, కొత్తపల్లి మధుసూదన్, అన్నవెల్లి మల్లికార్జున్, కీల కుమార్, శివ ప్రసాద్, రాజు, సుంకరి బాల కుమార్ లతో పాటు జంగమ సమాజం, లింగ బలిజ సమాజ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గడిబురుజుల భూముల వ్యవహారంలో భారీ అక్రమాలు

### కమిషనర్‌పై సీడీఎంఏకు ఫిర్యాదు

**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** కోరుట్ల పట్టణంలోని చారిత్రాత్మక గడిబురుజుల ప్రభుత్వ భూములను ప్రైవేట్ వ్యక్తులకు అన్యాక్రాంతం చేసేందుకు మున్సిపల్ అధికారులు కుట్ర పన్నారన్న ఆరోపణలు పట్టణంలో తీవ్ర దుమారం రేపుతున్నాయి. ప్రభుత్వ విలువైన భూములను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు మున్సిపల్ కమిషనర్ సహకరిస్తున్నారంటూ బీజేపీ కౌన్సిలర్లు కమిషనర్ & డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (జణహీూ)కు ఫిర్యాదు చేయడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

వి.ఎల్.టి నెంబర్ల కేటాయింపులో అవినీతి?


కోరుట్ల పట్టణ నడిబొడ్డున సుమారు 5010 గజాల విస్తీర్ణంలో ఉన్న చారిత్రాత్మక గడిబురుజుల స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు తప్పుడు వి.ఎల్.టి (మూ) నెంబర్లు కేటాయించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేవలం వీలునామా పత్రాల ఆధారంగా, మున్సిపల్ కమిషనర్ తన అధికార పరిమితికి మించి వ్యవహరించి అక్రమ రిజిస్ట్రేషన్లకు మార్గం సుగమం చేశారని బీజేపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ ప్రక్రియలో భారీగా అవినీతి జరిగిందని, చారిత్రక ఆధారాలను చెరిపివేసే ప్రయత్నం జరుగుతోందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

దసరా ఉత్సవాల వేదికకు ముప్పు

ఈ గడిబురుజుల స్థలం స్థానిక ప్రజల ఆధ్యాత్మిక భావాలతో ముడిపడి ఉంది. ప్రతి ఏటా దసరా నవరాత్రుల సందర్భంగా ఇక్కడ 'మహిషాసుర మర్ధన' కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. ఈ స్థలం ప్రైవేట్ వ్యక్తుల పరం అయితే ఈ సాంప్రదాయం నిలిచిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణ వారసత్వ సంపదను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని వారు గుర్తు చేస్తున్నారు.

సమగ్ర విచారణకు డిమాండ్

ఈ అక్రమాలపై బీజేపీ కౌన్సిలర్లు కలాల రాధాసాయిచంద్ (25వ వార్డు), ఇందూరి తిరుమల వాసు (27వ వార్డు), సోరుపాక రమాదేవి రమేశ్ (5వ వార్డు), గుగులావత్ శ్రీకాంత్ (7వ వార్డు) మరియు బీజేపీ పట్టణ అధ్యక్షుడు కస్తూరి లక్ష్మీనారాయణ కలిసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. మున్సిపల్ కమిషనర్ రవిందర్‌పై శాఖాపరమైన మరియు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అక్రమంగా కేటాయించిన నెంబర్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అక్రమ కేటాయింపులపై సమగ్ర విచారణ జరిపి


Induri Thirumala Vasu
27th Ward Councillor
Municipal Council, Korutla.

కోరుట్ల ప్రజల ఆస్తులను కాపాడాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ ఫిర్యాదుపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో అన్నది ఇప్పుడు సర్వత్రా ఉత్కంఠ కలిగిస్తోంది.

# ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచొద్దు

### కలెక్టర్ చిత్రా మిశ్రా

**నేటిసాక్షి, కరీంనగర్:** ప్రజావాణి దరఖాస్తులను పెండింగులో ఉంచకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే (స్థానిక సంస్థలు), ఆర్డీవోలు రమేష్ బాబు, మహేశ్వర్ తో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. ప్రజావాణి కి మొత్తం 238 దరఖాస్తులు రాగా.. అత్యధికంగా కరీంనగర్ నగరపాలిక సంస్థ నుంచి 59 వచ్చాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# శ్రీనివాసరెడ్డి జన్మదిన వేడుకలు



**నేటి సాక్షి,తొగుట వడ్డే నర్సింలు:** దుబ్బాక కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ మంత్రి స్వర్గీయ చెరుకు ముత్యంరెడ్డి తనయుడు చెరుకు శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలను తుక్కాపూర్ స్మృతి వనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి తన తండ్రి ముత్యం రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం అభిమాన బృందం ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా అభిమానులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం చెరుకు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. తన జీవితం పూర్తిగా దుబ్బాక నియోజకవర్గ ప్రజల సేవకే అంకితమని స్పష్టం చేశారు. తండ్రి ఆశయ సాధనలో భాగంగా ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవ చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డి, తొగుట ఏఎంసీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి (అమర్), చేగుంట ఏఎంసీ చైర్మన్ తాడెం వెంగళరావు, మండల పార్టీ అధ్యక్షులు అక్కం స్వామి, నాయకులు బూస నిరంజన్ రెడ్డి, యేన్నం భూపాల్ రెడ్డి, కొండల్ రెడ్డి, రవీందర్, తాండ్ర విజయపాల్ రెడ్డి, సోలిపేట ప్రసాద్ రెడ్డి, స్వామి, సంధ్రుగు శ్రీకాంత్, ప్రవీణ్, నరసింహులు గౌడ్, సిద్ది శ్రీనాకర్ రెడ్డి, గంట రవీందర్, గోపాల్, బండారు లాలు, కర్నాల శ్రీనివాస్ రావు, మాసంపల్లి మహేందర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ఉప్పలయ్య, తిరుపతి, కాంగ్రెస్ కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కోఆప్షన్ సభ్యురాలిగా అవకాశం ఇవ్వాలి

### ఫర్జానా బేగం విజ్ఞప్తి



**నేటి సాక్షి,గజ్వేల్:** టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం నుండి పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తున్న తనకు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో మైనార్టీ మహిళా కోఆప్షన్ సభ్యురాలిగా అవకాశం కల్పించాలని పార్టీ మహిళా నాయకురాలు ఫర్జానా బేగం కోరారు. శనివారం గజ్వేల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఈ పదవి కోసం మున్సిపల్ కార్యాలయంలో తన దరఖాస్తును అధికారికంగా సమర్పించినట్లు వెల్లడించారు. గత మూడు పర్యాయాలుగా మున్సిపల్ ఎన్నికల సమయంలో కౌన్సిలర్‌గా లేదా నామినేటెడ్ పదవిలో అవకాశం కల్పిస్తామని పార్టీ పెద్దలు హామీ ఇచ్చారని ఆమె గుర్తు చేశారు. అప్పట్లో ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, వంటేరు ప్రతాపరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ తనకు భరోసా ఇవ్వడంతో వారి సూచన మేరకు పోటీ నుండి తప్పుకున్నానని తెలిపారు. పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తున్న తనలాంటి కార్యకర్తలను గుర్తించి, ప్రస్తుతం ఖాళీగా ఉన్న మైనార్టీ మహిళల కోఆప్షన్ స్థానాన్ని కేటాయించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. పార్టీ అధినేత కేసీఆర్ అడుగుజాడల్లో నడుస్తూ ప్రజలకు సేవ చేసేందుకు తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నానని ఫర్జానా బేగం పేర్కొన్నారు. ఈ విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు తనకు మద్దతు తెలపాలని కోరారు. ఈ సమావేశంలో పలువురు పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

# చౌడేపల్లిలో వింత

### మూడు దూడలకు జన్మనిచ్చిన పాడి ఆవు



**నేటి సాక్షి,చౌడేపల్లి :** చౌడేపల్లి మండలంలో ఒక అరుదైన ఘటన చోటుచేసుకుంది. ఒకే ఈతలో ఒక ఆవు మూడు దూడలకు జన్మనివ్వడం స్థానికంగా అబ్బురపరిచింది. మండలంలోని దిగువపల్లి పంచాయతీ అప్పినపల్లి గ్రామానికి చెందిన రైతు సుబ్రహ్మణ్యంకు చెందిన పాడి ఆవు సోమవారం ఉదయం ప్రసవ వేదనకు గురైంది. దీనిపై సమాచారం అందుకున్న పశువైద్యాధికారి పవన్ కుమార్, తన సిబ్బంది రామచంద్ర, కీర్తనలతో కలిసి తక్షణమే గ్రామానికి చేరుకున్నారు. వైద్యుల పర్యవేక్షణలో ఆవు మూడు కోడె దూడలకు జన్మనిచ్చింది. ప్రస్తుతం తల్లి ఆవుతో పాటు మూడు దూడలు ఆరోగ్యంగా, చలాకీగా ఉన్నాయని వైద్యులు తెలిపారు. సాధారణంగా ఆవులకు ఒక దూడ జన్మించడం సహజమని, అయితే జన్యుపరమైన లక్షణాల కారణంగానే ఇలా ఒకే ఈతలో మూడు దూడలు జన్మించాయని పశువైద్యాధికారి పవన్ కుమార్ వివరించారు. ఒకేసారి మూడు దూడలు పుట్టడంతో రైతు సుబ్రహ్మణ్యం కుటుంబంతో పాటు గ్రామస్తులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ ఆవును ఆసక్తిగా చూస్తున్నారు.

నేటి సాక్షి
TGTEL/25/A1737
కరీంనగర్
మంగళవారం
21 ఏప్రిల్ 2026

# సమానత్వానికి మార్గదర్శి బసవేశ్వరుడు

- **మున్సిపల్ చైర్‌పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్**

**నేటి సాక్షి, జగిత్యాల(పూరెళ్ల బాపు):** మహాత్మా బసవేశ్వర గారి 893వ జయంతి సందర్భంగా ధరూర్ క్యాంప్ చౌరస్తా వద్ద గల ఆయన విగ్రహానికి చైర్‌పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ పుష్పాంజలి ఘటించారు. మున్సిపల్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. బసవేశ్వర గారు సమానత్వం, సామాజిక న్యాయం, శ్రమకు గౌరవం వంటి విలువలను సమాజానికి అందించిన మహానుభావుడని పేర్కొన్నారు. 12వ శతాబ్దంలోనే సమసమాజ స్థాపనకు కృషి చేసిన మహనీయుడిగా ఆయనను కొనియాడారు. అనుభవ మండపం ద్వారా ప్రజాస్వామ్యానికి పునాది వేసి, మహిళలకు సమాన హక్కులు కల్పించడంలో ఆయన చూపిన మార్గం నేటికీ ప్రేరణగా నిలుస్తుందని అన్నారు. బసవేశ్వర గారి ఆశయాలను కొనసాగిస్తూ సమానత్వ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని చైర్‌పర్సన్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు నందయ్య, కౌన్సిలర్లు జుంబర్తి గంగలక్ష్మి రాజ్‌కుమార్, మూలస్థం లావణ్య మహేష్, బైర్నీని భాగ్య, గోపి, సిరిపురం శ్రీలత శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ స్పందన, నాయకులు గాజుల రాజేందర్, బండ శంకర్, వీరశైవ సమాజ అధ్యక్షులు కంది కైలాసం మరియు అడ్డగూరి నాగేంద్ర, సూరం వీరయ్య, అంగడిమతం చరణ్ అయ్యవారు, గుంటి నిరంజన్, తదితరులు, వీరశైవ సభ్యులు, ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.



# గడిబురుజుల భూముల పరిరక్షణకు కదం తొక్కిన అఖిలపక్షం





**నేటి సాక్షి,కోరుట్ల(రాధారపు నర్సయ్య):** కోరుట్ల పట్టణంలోని చారిత్రాత్మక గడిబురుజుల భూములపై విధించిన వాకెంట్ ల్యాండ్ ట్యాక్స్ (వీఎల్‌టీ)లను రద్దు చేయాలని మరియు ఆ భూములను అక్రమాల నుండి కాపాడాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్షం, ప్రజాసంఘాల ఐక్యవేదిక పోరాటానికి పిలుపునిచ్చింది. ఈ మేరకు మంగళవారం (21-04-2026) పాత మున్సిపల్ కార్యాలయం వద్ద భారీ నిరసన దీక్షలు చేపట్టాలని నిర్ణయించారు.

ఐక్యవేదిక సమావేశంలో కీలక తీర్మానాలు

సోమవారం సి. ప్రభాకర్ భవన్‌లో జరిగిన అఖిలపక్ష సమావేశంలో నాయకులు గడిబురుజుల భూముల భవిష్యత్తుపై సుదీర్ఘంగా చర్చించారు. గ్రామకంఠ/ఆబాది

- **నేటి నుండి నిరసన దీక్షలు**

పరిధిలోకి వచ్చే ఈ భూములపై అక్రమంగా వీఎల్టీలు విధించడం ప్రజలపై భారంగా మారిందని మండిపడ్డారు. ఈ భూములు భూ అక్రమార్కుల పరం కాకుండా, కేవలం ప్రజా ప్రయోజనాలకే వినియోగించాలని వారు డిమాండ్ చేశారు. ఈ స్థలాల్లో కూరగాయల మార్కెట్, పార్కు వంటివి ఏర్పాటు చేయాలని, అలాగే మైసమ్మ తల్లి దేవాలయాన్ని అభివృద్ధి చేసి, కోనేరును పునరుద్ధరించాలని తీర్మానించారు. చారిత్రక కట్టడాలను సంరక్షించి, ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని కోరారు.

ప్రజా పోరాటానికి సిద్ధం

పట్టణ ఆస్తిని కాపాడుకునేందుకు రాజకీయాలకు అతీతంగా ప్రజలు, యువత, మేధావులు ఈ నిరసన దీక్షల్లో భారీగా పాల్గొనాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అఖిలపక్ష నాయకులు చెన్న విశ్వనాథం, డా. పేట భాస్కర్, ఎం.డి. ముజాహిద్, చింతా భూమేశ్వర్, ఎం.డి. ముజీబుర్ రెహమాన్, సుతారి రాములు, తుమ్మనపల్లి శ్రీనివాస్ బాబు, కుంచెం శంకర్, శనిగారపు రాజేష్, పోతని సత్యం, న్యాయవాది బర్ల సంతోష్, గణేష్, వికాస్, రమేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు. చారిత్రక గడి భూముల రక్షణ కోసం ఐక్యంగా పోరాడి విజయం సాధిస్తామని నాయకులు స్పష్టం చేశారు.

# కన్నుల పండుగల శ్రీ బసవ జయంతి






**నేటి సాక్షి,చౌడేపల్లి:** కుల మతాలకు అతీతంగా పోరాడిన యోధుడు మహిళలు అని రంగాలలో ముందుండాలని పోరాటాలు చేసిన ఉద్యమకారుడు 12వ శతాబ్దంలోనే లింగాయత్ ధర్మ సంస్థాపన చేసిన మహోన్నతుడు బసవ జయంతిని కన్నుల పండుగగా నిర్వహించారు. స్థానిక మఠం రవి ఆధ్వర్యంలో ఉదయాన్నే ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలు ప్రారంభించారు, గణపతి పూజ శివ స్తోత్రాలతో సాంప్రదాయపద్ధంగా పూజాది కార్యక్రమాలు జరిగాయి, నాటి సమాజంలో ఉన్న కులమతాలకు వ్యతిరేకంగా ఆయన పోరాడిన పోరాటాలు ఉద్యమాలను గుర్తు చేశారు. అనంతరం మహిళలు బసవన్నలకు పూజలు చేశారు అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పుంగనూరు నియోజకవర్గ వీరశైవ లింగాయత్ జంగం సేవా సంఘం అధ్యక్షుడు తానాధర్ నాగరాజా, ప్రముఖ వైద్యుడు శివకుమార్ ,బసవరాజా సురేంద్ర, శివన్న, రాజన్న ,లోకేష్ ,డాక్టర్ అశోక్ మండలంలోని లింగాయత్ జంగమ సేవా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# పసుపుల గ్రామ స్టేజి వద్ద వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**నేటి సాక్షి,మరికల్ (ఇమామ్ సాబ్):** రైతులు తాము పండించిన పంటను మద్దతు ధరకు విక్రయించుకోవాలనే ఉద్దేశంతో నారాయణపేట జిల్లా మరికల్ మండల పరిధిలోని పసుపుల గ్రామ స్టేజి వద్ద వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఘనంగా ప్రారంభించారు. పసుపుల గ్రామ సర్పంచ్ నర్మద రవి కుమార్ గౌడ్, ఉప సర్పంచ్ మహేష్ కుమార్, మరియు ధన్వాడ పీఏసీఎస్ (గూజా) వెంకట్రాములు కలిసి ఈ కేంద్రాన్ని ప్రారంభించి రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సూర్య మోహన్, వార్డు సభ్యులు,



మాజీ సర్పంచ్‌లు, మాజీ వార్డు సభ్యులు పాల్గొన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పదోన్నతి ఉత్సాహంతో పాటు మరింత బాధ్యత పెంచుతుంది

**నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్**

**నేటి సాక్షి,నారాయణపేట, (ఇమామ్ సాబ్ ):** ప్రజలకు బాధ్యతాయుతంగా సేవలు అందిస్తే సమాజంలో పోలీసుల పట్ల గౌరవం, మర్యాదలు మరింత పెరుగుతాయని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. కానిస్టేబుల్ గా పనిచేస్తున్న బి శ్రీనివాసులు హెడ్ కానిస్టేబుల్ గా పదోన్నతి పొందారు. సోమవారం ఆయన జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ గారిని ఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ తన చేతుల మీదుగా పదోన్నతి పొందిన హెడ్ కానిస్టేబుల్ కు జమిందార్ పట్టీలను అలంకరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... పదోన్నతి అనేది కేవలం ఉత్సాహానికే కాదు, మరింత బాధ్యతను కూడా తీసుకువస్తుందని చెప్పారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు భరోసా, నమ్మకం కలిగించే విధంగా పని చేయాలని, ముఖ్యంగా నిరుపేద ప్రజలకు పోలీసులు అండగా నిలవాలని సూచించారు.



# సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**



**(నేటి సాక్షి, రాజన్న సిరిసిల్ల (శివకుమార్):** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకే 'ప్రజావాణి' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ పాల్గొని బాధితుల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా వివిధ సమస్యలపై మొత్తం 218 దరఖాస్తులు వచ్చాయి. వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల మేరకు గడువులోగా పరిష్కరించాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఈ ప్రజావాణిలో అత్యధికంగా మున్సిపల్ కమిషనర్ సిరిసిల్లకు 35 దరఖాస్తులు అందగా, గృహ నిర్మాణ శాఖకు 31 అర్జీలు వచ్చాయి. అలాగే జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి, ఉపాధి కల్పనా శాఖలకు చెరో 13, తంగళ్ళపల్లి తహసీల్ కార్యాలయానికి 11 దరఖాస్తులు అందాయి. సిరిసిల్ల తహసీల్ ఆఫీస్, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా సంక్షేమ అధికారులకు చెరో 7 దరఖాస్తులు వచ్చాయి. వేములవాడ ఆర్డీఓకు 6, వేములవాడ మున్సిపాలిటీతో పాటు తంగళ్ళపల్లి, కోనరావుపేట ఎంపీడీఓ కార్యాలయాలకు చెరో 5 దరఖాస్తులు అందాయి. ముస్తాబాద్, వేములవాడ, ఎల్లారెడ్డిపేట తహసీల్ కార్యాలయాలతో పాటు విద్యుత్ శాఖకు చెరో 4 అర్జీలు అందగా, ఇతర శాఖలకు కూడా పలు దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల మరియు వేములవాడ ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాభాయి, హౌసింగ్ పీడీ వెంకట మాధవరావు తో పాటు వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# కన్నారావుపేటలో మహిళా సంఘం భవనానికి భూమి పూజ



**నేటి సాక్షి,నల్లబెల్లి:** మండలంలోని కన్నారావుపేట గ్రామంలో మహిళా సంఘం నూతన భవన నిర్మాణ పనులకు సోమవారం ఘనంగా అంకురార్పణ జరిగింది. ఈ భవన నిర్మాణానికి కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు చరణ్ సింగ్, జిల్లా కార్యదర్శి చిట్యాల తిరుపతిరెడ్డి కలిసి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం కావడానికి ఈ భవనం ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మూర్తి, మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వైనాల అశోక్, జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు జిల్లా మునీందర్, కిసాన్ సెల్ మండల అధ్యక్షులు ఏడాకుల సంపత్ రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు వేముల సంపత్ రెడ్డి, నాయకులు బత్తిని మహేష్ పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మనోహర్, పోగుల కుమారస్వామి, అఖిల్, సురేష్, సహదేవ్, దేవేందర్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

# జగిత్యాలలో ప్రజావాణి

**అధికారులకు కలెక్టర్ సత్యప్రసాద్ కీలక ఆదేశాలు**



**నేటి సాక్షి, జగిత్యాల (పూరెళ్ల బాపు):** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన అర్జీలపై అధికారులు సమగ్ర విచారణ జరిపి, సమస్యలను త్వరగా పరిష్కరించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలతో కలిసి ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఎంతో ఆశతో ప్రజావాణికి వస్తారని, అధికారులు వారి పట్ల సానుకూలంగా వ్యవహరించాలని సూచించారు. శాఖల వారీగా అందిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, వాటిని పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కారానికి చొరవ చూపాలని అధికారులను ఆదేశించారు. కాగా, ఈరోజు నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 63 ఫిర్యాదులు రాగా, వాటిని సంబంధిత విభాగాలకు బదిలీ చేసి తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్, కోరుట్ల మరియు మెట్‌పల్లి ఆర్డీఓలు జీవాకర్ రెడ్డి, నరసింహ రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు మరియు సిబ్బంది పాల్గొన్నారు.



## సఫారీలదే రెండో టీ20

**డర్బన్:** మరో రెండు నెలల్లో మొదలుకానున్న మహిళల టీ20 ప్రపంచకప్‌నకు సన్నాహకంగా దక్షిణాఫ్రికాతో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భారత్‌కు వరుసగా రెండో పరాభవం ఎదురైంది. ఓటమితో సిరీస్‌ను ప్రారంభించిన ఉమెన్ ఇన్ బ్లూ.. ఆదివారం డర్బన్‌లో జరిగిన రెండో మ్యాచ్‌లోనూ విఫలమైంది. మ్యాచ్‌లో ప్రత్యర్థి ఆహ్వానం మేరకు ఫస్ట్ బ్యాటింగ్ చేసిన టీమ్‌ఇండియా.. నిర్ణీత ఓవర్లకు 147 రన్స్‌కే ఆలౌట్ అయింది. షెఫాలీ వర్మ (57), అనుష్క శర్మ (28) మినహా మిగిలిన బ్యాటర్లు తేలిపోయారు. సఫారీ బౌలర్లలో ట్రైయాన్ (3/22), సెకుకునె (3/31) భారత్‌ను కట్టడిచేశారు. స్వల్ప ఛేదనను సౌతాఫ్రికా అమ్మాయిలు 17.1 ఓవర్లలోనే దంచేశారు. కెప్టెన్ లారా వోల్వార్ట్ (54), సునె లుస్ (57) అర్ధ శతకాలతో తొలి వికెట్‌కు 106 రన్స్ జోడించారు. ఇరుజట్ల మధ్య మూడో టీ20 ఈనెల 22న జోహన్నెస్‌బెర్గ్‌లో జరుగుతుంది.

## ‘దిల్ చాహతా హై’

### అర్ష్‌దీప్ సింగ్ కు ప్రీతి జింటా హగ్.. స్టార్ పేసర్ ఖుషీ!



**లక్నో:** బాలీవుడ్ హీరోయిన్, పంజాబ్ కింగ్స్ ఫ్రాంచైజీ సహ యజమాని ప్రీతి జింటా గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఐపీఎల్‌లో పంజాబ్ జట్టును గెలిపించిన ఆటగాడికి ఓ హగ్ ఇస్తుంటారు. ఒకప్పుడు పంజాబ్ జట్టుకు ఆడిన యువరాజ్ సింగ్, క్రిస్ గేల్ లాంటి దిగ్గజాలకు సహా మరికొందరికి ప్రీతి హగ్ ఇచ్చారు. గతేడాది కూడా గెలుపు జోష్ లో చాలా మంది ఆటగాళ్లను ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. కాస్త బిజీగా ఉన్న ప్రీతి జింటా.. ఐపీఎల్ 2026లో మ్యాచ్‌లకు హాజరుకాలేదు. ఆదివారం లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌కు హాజరై సందడి చేశారు. లక్నోపై విజయం అనంతరం పంజాబ్ సహ యజమాని ప్రీతి జింటా మైదానంలోకి వచ్చి ఆటగాళ్లను అభినందించారు. ఈ క్రమంలో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌ను హగ్ చేసుకున్నారు. అర్ష్‌దీప్ ఆ క్షణాన్ని బాగా ఆస్వాదించాడు. ‘యాహూ.. ప్రీతి జింటా హగ్ ఇచ్చిందోచ్’ అంటూ ఎగిరి గంతేశాడు. దాంతో అక్కడ ఉన్నవారంతా ఆశ్చర్యపోయారు. ప్రీతి కూడా ఇదేంటి అన్నట్లు చూశారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ సన్నివేశం జట్టు సభ్యుల మధ్య ఉన్న బంధాన్ని, యజమాన్యం-ఆటగాళ్ల మధ్య ఉన్న అనుబంధాన్ని స్పష్టంగా చూపించింది. ఐపీఎల్ 2026లో పంజాబ్ కింగ్స్ జైత్రయాత్ర కొనసాగుతోంది. ఈ సీజన్లో ఓటమి ఎరుగని జట్టు పంజాబ్ మాత్రమే. లక్నోను ఓడించడం ద్వారా మరో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో అగ్ర స్థానంలో (11 పాయింట్స్) కొనసాగుతోంది. ఇదే ఊపుతో ముందుకు సాగాలని అభిమానులు కోరుకుంటున్నారు. ప్రీతి జింటా తన జట్టుకు అందించే మద్దతు, ఆటగాళ్లలో మరింత ఆత్మవిశ్వాసాన్ని నింపుతోందని ఈ వైరల్ వీడియో ద్వారా స్పష్టమైంది.

# తిలక్ వర్మ సుడిగాలి శతకం!

## గుజరాత్‌పై 99 పరుగుల తేడాతో ముంబై ఘన విజయం



- నరేంద్ర మోడీ స్టేడియంలో ఏకపక్షంగా సాగిన పోరు
- కేవలం 45 బంతుల్లోనే అజేయంగా 101 పరుగులు చేసిన తిలక్
- బంతితో చెలరేగిన అశ్వని కుమార్.. నాలుగు వికెట్లు కైవసం
- 100 పరుగులకే కుప్పకూలిన గుజరాత్ బ్యాటింగ్ లైనప్



**అహ్మదాబాద్, ఏప్రిల్ 20:** ఐపీఎల్ తాజా సీజన్ ముప్పై వ మ్యాచ్‌లో ముం బై జట్టు సమగ్ర ఆధి పత్యం చెలాయిం చింది. నరేంద్ర మో డీ స్టేడియంలో సో మవారం జరిగిన ఈ పోరులో గుజరాత్ జట్టుపై తొంభై తొమ్మి ది పరుగుల భారీ తేడాతో ముంబై ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ముంబై జట్టు నిర్ణీత ఇరవై ఓవర్లలో ఐదు వికెట్ల నష్టా నికి 199 పరుగులు చేసింది. తిలక్ వర్మ అద్భుత శతకంతో కదం తొక్కాడు. లక్ష్య ఛేదనలో గుజరాత్ బ్యాటర్లు పూర్తిగా చేతులెత్తేయడంతో ఆ జట్టు కేవలం 15.5 ఓవర్లలో సరిగ్గా వంద పరుగులకే ఆలౌట్ అయింది.

### ఆదుకున్న నమన్.. ఆకాశమే హద్దుగా తిలక్

టాస్ గెలిచిన గుజరాత్ కెప్టెన్ శుభమన్ గిల్ ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. బ్యాటింగ్ కు దిగిన ముంబైకి ఆరంభంలోనే సవాళ్లు ఎదురయ్యాయి. స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ పది బంతుల్లో పదిహేను పరుగులు చేసి అవుట్ కాగా, ఇతర టాపార్డర్ బ్యాటర్లు కూడా భారీ స్కోర్లు చేయలేకపోయారు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన తిలక్ వర్మ, నమన్ ధీర్ తో కలిసి ఇన్నింగ్స్ ను చక్కదిద్దాడు. నమన్ ధీర్ 32 బంతుల్లో 45 పరుగులు చేసి అద్భుతమైన సహకారం అందించాడు. అతడు అవుటైన తర్వాత తిలక్ వర్మ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. గుజరాత్ బౌలర్లపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతూ కేవలం 45 బంతుల్లోనే అజేయంగా 101 పరుగులు సాధించాడు. దీంతో ముంబై భారీ స్కోరు సాధించగలిగింది. గుజరాత్ బౌలర్లలో కగిసో రబాడ నాలుగు ఓవర్లలో 33 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు పడగొట్టాడు. మహ్మద్ సిరాజ్ కు ఒక వికెట్, ప్రసిద్ధ్ కృష్ణకు ఒక వికెట్ దక్కాయి. ప్రసిద్ధ్ కృష్ణ నాలుగు ఓవర్లలో ఏకంగా 54 పరుగులు సమర్పించుకోవడం గమనార్హం.

### పేర్చిన పేకమేడలా గుజరాత్ ఇన్నింగ్స్

రెండు వందల పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్ జట్టు ఏ దశలోనూ విజయం దిశగా సాగలేదు. ముంబై బౌలర్ల కట్టుదిట్టమైన బంతులకు గుజరాత్ బ్యాటర్లు క్రీజులో నిలవలేకపోయారు. వాషింగ్టన్ సుందర్ 17 బంతుల్లో 26 పరుగులతో టాప్ స్కోరర్ గా నిలవడం ఆ జట్టు బ్యాటింగ్ వైఫల్యానికి అద్దం పడుతోంది. షారుఖ్ ఖాన్ 13 బంతుల్లో 17 పరుగులు, కెప్టెన్ శుభమన్ గిల్ 13 బంతుల్లో 14 పరుగులు మాత్రమే చేసి తీవ్రంగా నిరాశపరిచారు. మిగతా బ్యాటర్లంతా సింగిల్ డిజిట్ కే పరిమితం కావడంతో ఇన్నింగ్స్ పేర్చిన పేకమేడలా కుప్పకూలింది.

### అశ్వని కుమార్ అద్భుత స్పెల్

ముంబై బౌలర్లలో అశ్వని కుమార్ అద్భుత ప్రదర్శనతో గుజరాత్ పతనాన్ని శాసించాడు. నాలుగు ఓవర్లలో కేవలం 24 పరుగులు మాత్రమే ఇచ్చి ఏకంగా నాలుగు వికెట్లు పడగొట్టాడు. స్పిన్నర్ మిచెల్ సాంట్నర్ మూడు ఓవర్లలో 16 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు తీశాడు. అల్లా గజన్ఫర్ 2.5 ఓవర్లు బౌలింగ్ చేసి 17 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. ఏకపక్షంగా సాగిన ఈ మ్యాచ్ లో అద్భుత శతకంతో ముంబై విజయానికి బాటలు వేసిన తిలక్ వర్మకు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది.





# కెనడా కెప్టెన్‌పై మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలు

### ఐసీసీ నజర్‌లో దిల్‌ప్రీత్ బజ్వా

**ముంబై :** ఇటీవల వరల్డ్‌కప్‌లో ఆడిన కెనడా జట్టు టీ20 కెప్టెన్ దిల్‌ప్రీత్ బజ్వా(ఊఆశ్రీజూతీవవ్ దీుఇఘు)పై మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలు వచ్చాయి. అంతర్జాతీయ క్రికెట్ మండలికి చెందిన అవినీతి నిరోధక యూనిట్ ఆ ఆరోపణలపై దర్యాప్తు చేపడుతున్నది. టీ20 వరల్డ్‌కప్ సమయంలో న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో దిల్‌ప్రీత్ ఫిక్సింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. పంజాబ్‌లోని బాటాలాలో జన్మించాడు దిల్‌ప్రీత్. అతని వయసు 24 ఏళ్లు. వరల్డ్‌కప్‌లో అతని ఆటతీరుపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కెనడా, న్యూజిలాండ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌పై ఏసీయూ దర్యాప్తు చేపడుతోంది. ఈ ఏడాది ఫిబ్రవరి 17వ తేదీన ఆ మ్యాచ్ జరిగింది. న్యూజిలాండ్ 174 రన్స్ చేజింగ్ చేస్తున్న సమయంలో 35-2 స్కోరు వద్ద అకస్మాత్తుగా దిల్‌ప్రీత్ బజ్వా బౌలింగ్ చేశాడు. అతను తన తొలి ఓవర్‌లో నోబ్‌లు, వైడ్‌లు వేశాడు. మొత్తం 15 రన్స్ ఇచ్చాడు. కానీ అనూహ్యంగా అతను బౌలింగ్ చేయడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మ్యాచ్ కీలక దశలో ఉన్నప్పుడు బజ్వా బౌలింగ్ చేసినట్లు తెలుస్తోంది. దీనిపై ఏసీయూ అనుమానాలు వ్యక్తం చేస్తున్నది. స్పాట్ ఫిక్సింగ్‌కు పాల్పడిన బౌలర్లు.. కావాలని నోబ్ లేదా వైడ్ వేసే అవకాశాలు ఉంటాయి. ఆ కోణంలో బజ్వాపై విచారణ జరగనున్నది. ఇటీవల కెనడా టీవీలో ఓ డాక్యుమెంటరీ ప్రసారమైంది. కరప్షన్, క్రైం, క్రికెట్ అన్న టైటిల్‌తో ఆ డాక్యుమెంటరీ ప్రజెంట్ చేశారు. టీం సెలెక్షన్‌తో పాటు బజ్వాను కెప్టెన్‌గా ఎంపిక చేయడం పట్ల అనుమానాలు వ్యక్తం చేశారు. కివీస్‌తో జరిగిన మ్యాచ్‌లో కెనడా ఓటమి పాలైంది. కానీ ఆ మ్యాచ్‌లో బెట్టింగ్ లాంటి ఆరోపణలను కూడా ఏసీయూ దర్యాప్తు చేయనున్నది. ఫోన్, కమ్యూనికేషన్ రికార్డులను పరిశీలిస్తారు. ప్రస్తుతం ఆ క్రికెటర్‌పై ఎటువంటి అభియోగాలు నమోదు కాలేదు. కానీ అతని వ్యవహార శైలిపై అనుమానాలు రావడంతో దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిసింది. పంజాబ్ దేశవాళీ క్రికెట్‌లో చోటు దక్కకపోవడంతో గురుదాస్‌పూర్‌కు చెందిన దిల్‌ప్రీత్ బజ్వా 2020లో కెనడా వెళ్లాడు. గ్లోబల్ టీ20 కెనడా లీగ్‌లో అతను పేరు సంపాదించుకున్నాడు. మాంట్రియల్ టైగర్స్ తరపున ఆడిన అతను ఓ సెంచరీ కొట్టి అందరి దృష్టిలో పడ్డాడు. 2026లో కెనడా జాతీయ క్రికెట్ జట్టుకు కెప్టెన్ అయ్యాడు. జాతీయ క్రికెట్ జట్టుకు కెప్టెన్‌గా బాధ్యతలు స్వీకరించిన తొలి సిక్కుగా రికార్డు క్రియేట్ చేశాడు. అయితే కెనడా ఇంటెలిజెన్స్ ప్రకారం క్రికెట్ బెట్టింగ్, ఫిక్సింగ్‌లో లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ పాత్ర ఉన్నట్లు అనుమానిస్తున్నారు. కెనడాలోని సర్రే, బ్రిటీష్ కొలంబియా జట్ల ఆటగాళ్లను బిష్ణోయ్ గ్యాంగ్ బెదిరించినట్లు తెలుస్తోంది. కావాలని నోబ్, వైడ్ వేసినట్లు అనుమానాలు వ్యక్తం కావడంతో ప్రస్తుతం బజ్వాను ఐసీసీ విచారిస్తున్నది. అతని ఫోన్‌ను సీజ్ చేసింది. డెల్టా, బీసీ, ఆర్సీఎంపీ రాష్ట్రాలకు చెందిన కెనడా పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు. బెదిరింపులు, కాల్పుల ఘటనలకు లింకులు ఉన్నట్లు అనుమానిస్తున్నారు. కెనడా పోలీసులు, కెనడా క్రికెట్ ప్రకారం మాత్రం బజ్వాపై ఇంకా ఎటువంటి నేరం రుజువుకాలేదు.



# చీరకట్టులో కేరళ కుట్టి

**న్యూ లుక్‌తో సోషల్ మీడియాలో అనిఖా హల్‌చల్**



కేరళకు చెందిన యువ నటి అనిఖా సురేంద్రన్ తన తాజా ఫోటోషూట్‌తో మరోసారి అభిమానులను ఆకట్టుకుంటోంది. సంప్రదాయ శైలిలో తీసిన ఈ ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతున్నాయి. తాజాగా విడుదలైన చిత్రాల్లో అనిఖా గోల్డెన్ ఆర్గాంజా చీరలో సిల్వర్ డిజైన్స్‌తో మెరిసిపోతూ కనిపించింది. దీనికి జతగా ఆమె ధరించిన డీప్ రెడ్ ప్రింటెడ్ బ్లౌజ్ లుక్‌కు మరింత ఆకర్షణను తెచ్చింది. సంప్రదాయ అందాన్ని హైలైట్ చేస్తూ ఆమె పెద్ద సిల్వర్ ఆక్సిడైజ్డ్ చెవిపోగులు, రంగురంగుల గాజులు, సింపుల్ బొట్టు ధరించి సహజమైన గ్లామర్‌ను ప్రదర్శించింది. ప్రకృతి మధ్యలో తీసిన ఈ ఫోటోలు ఆమె చిరునవ్వుతో మరింత అందంగా మారాయి. బాలనటిగా సినీ ప్రయాణాన్ని ప్రారంభించిన అనిఖా, ఇప్పుడు హీరోయిన్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటోంది. గ్లామర్‌తో పాటు నటనలోనూ మెప్పిస్తున్న ఆమె, కొత్త లుక్‌తో మరోసారి అభిమానుల దృష్టిని ఆకర్షించింది.






## దెయ్యాలనూ భయపెట్టించే

# ఓం శాంతి డిస్కో శాంతి

టాలీవుడ్‌లో వినూత్న కథలతో గుర్తింపు పొందిన దర్శకుడు మహి వి. రాఘవ్ మరోసారి ప్రేక్షకులను ఆశ్చర్యపరిచే ప్రయత్నంలో ఉన్నారు. ఆయన దర్శకత్వంలో రూపొందుతున్న తాజా చిత్రం 'ఓం శాంతి డిస్కో శాంతి' అనే టైటిల్‌తోనే ఆసక్తిని రేపుతోంది. హారర్ కామెడీ జానర్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమా కాన్సెప్ట్ పూర్తిగా భిన్నంగా ఉండబోతోందని సమాచారం. సాధారణంగా దెయ్యాలు మనుషులను భయపెడతాయి. కానీ ఈ సినిమాలో పరిస్థితి పూర్తిగా రివర్స్‌గా ఉండనుంది. భయం అంటే ఏంటో తెలియని కొంతమంది వ్యక్తులు దెయ్యాలను ఎదుర్కొంటే ఏమవుతుంది? ఆ పరిణామాల్లో దెయ్యాలకే భయం పుడుతుందా? అనే వినూత్న ఆలోచనతో ఈ సినిమా రూపొందుతోంది. తాజాగా విడుదలైన మోషన్ పోస్టర్ సోషల్ మీడియాలో మంచి స్పందన తెచ్చుకుంది. "ఆల్ రెడీ కాషన్ కియా.. ఆల్ రెడీ" అనే క్యాప్షన్ సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచింది. ఈ చిత్రంలో జంప్ స్కేర్లు, కామెడీ సీన్లు, అనూహ్య ట్విస్టులతో కూడిన వినోదభరిత కథనం ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. ప్రేక్షకులకు పూర్తిగా కొత్త అనుభూతిని ఇవ్వడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్ట్ రూపొందుతోంది. సెప్టెంబర్ నెలలో ఈ సినిమాను థియేటర్లలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. కథ, స్క్రీన్‌ప్లే అందిస్తున్న మహి వి. రాఘవ్ షో రన్నర్‌గా వ్యవహరిస్తుండగా, దర్శకత్వ బాధ్యతలను గోగు ఆర్.ఆర్ నిర్వహిస్తున్నారు. మొత్తానికి, హారర్ కామెడీ జానర్‌లో మరోసారి తనదైన ముద్ర వేయడానికి మహి వి. రాఘవ్ సిద్ధమవుతున్నారని సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

## టాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్న

# వామికా గబ్బి

బాలీవుడ్‌లో తన నటనతో గుర్తింపు తెచ్చుకున్న నటి వామికా గబ్బి ఇప్పుడు టాలీవుడ్ వైపు దృష్టి సారిస్తోంది. ఇటీవల ఆమె నటించిన హిందీ చిత్రం ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయినా, దానిని పక్కన పెట్టి కొత్త అవకాశాలపై ఫోకస్ పెట్టింది. ప్రస్తుతం వామికా టాలీవుడ్‌లో భారీ ప్రాజెక్ట్‌గా భావిస్తున్న '+2' చిత్రంలో కీలక పాత్రలో నటిస్తోంది. ఈ సినిమాలో ఆమె చేరికపై ఇప్పటికే మంచి ఆసక్తి నెలకొంది. తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువ కావడానికి ఈ సినిమా ఆమెకు మంచి వేదికగా మారనుంది. ఇక భిన్న భాషా చిత్రాల్లోనూ అవకాశాలు అందుకుంటూ, వామికా తన కెరీర్‌ను విస్తరించుకుంటోంది. స్టైలిష్ లుక్స్‌తో పాటు నటనపరంగా కూడా గుర్తింపు తెచ్చుకుంటున్న ఆమె, టాలీవుడ్‌లో తనదైన ముద్ర వేయడానికి సిద్ధమవుతోంది.


## పెద్దిలో స్పెషల్ సాంగ్ కోసం

# సంయుక్త మీనన్



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ 'పెద్ది'. ఈ సినిమా అనౌన్స్ చేసినప్పటి నుండి దీనిపై అంచనాలు ఆకాశాన్ని తాకాయి. తాజాగా ఈ సినిమా గురించి ఒక క్రేజీ అప్‌డేట్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఈ సినిమాలో ఒక ప్రత్యేక గీతం కోసం 'గోల్డెన్ లెగ్' సంయుక్త మీనన్‌ను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. రామ్ చరణ్ సినిమాల్లో పాటలు, ముఖ్యంగా మాస్ సాంగ్స్ ఏ రేంజ్‌లో ఉంటాయో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. 'పెద్ది' కోసం ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ అదిరిపోయే ట్యూన్ సిద్ధం చేశారని సమాచారం. ఈ మాస్ నంబర్‌లో రామ్ చరణ్ సరసన సంయుక్త మీనన్ ఆడిపాడనుందనే వార్త ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్ అయ్యింది. సంయుక్త తొలిసారిగా అఖండ 2 లో బాలయ్య సరసన జాజికాయ అనే స్పెషల్ సాంగ్ లో నటించి మెప్పించింది. ఇప్పుడు మరోసారి స్పెషల్ సాంగ్‌లో మెగా హీరోతో స్క్రీన్ షేర్ చేసుకోవడం విశేషం. అయితే ఈ స్పెషల్ సాంగ్ లో చరణ్ సరసన మానస వారణాసి, మృణాల్ ఠాకూర్, పూజాహెగ్డే వంటి భామల పేర్లు వినిపించాయి కానీ చివరికి సంయుక్తకు డైరెక్టర్ బుచ్చిబాబు గ్రీన్ సిగ్నల్ ఇసినట్టు తెలుస్తోంది. ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే స్పోర్ట్స్ డ్రామాగా 'పెద్ది' రూపొందుతోంది. ఇందులో రామ్ చరణ్ మునుపెన్నడూ లేని విధంగా ఒక కొత్త లుక్‌లో కనిపించబోతున్నారు. ఇప్పటికే జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, ఇప్పుడు సంయుక్త మీనన్ స్పెషల్ అట్రాక్షన్‌గా నిలవనుంది. ఈ స్పెషల్ సాంగ్ సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని, బాక్సాఫీస్ వద్ద రికార్డులు తిరగరాయడం ఖాయమని ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు.

# బాబుమోహన్‌కు రేలంగి అవార్డు



హాస్యనటచక్రవర్తి పద్మశ్రీ రేలంగి అవార్డును నటుడు డా.బాబుమోహన్ అందుకున్నారు. 41ఏండ్ల నటజీవితాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా తెలుగు ఫిల్మ్ టెలివిజన్ వెల్ఫేర్ ఫార్మ్ అండ్ భారత్ కల్చరల్ అకాడమి సంస్థ ఆయనకు ఈ అవార్డును అందజేసింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాతల మండలి కార్యదర్శి టి.ప్రసన్నకుమార్, నాగబాల సురేశ్, నటుడు రాంకీ, 30ఇయర్స్ పృథ్వీరాజ్ తదితరులు అతిథులుగా పాల్గొని తెలుగు సినిమాకు బాబుమోహన్ చేసిన సేవలను కొనియాడారు. ఆయనతో తమ అనుభవాలను గుర్తుచేసుకున్నారు. బాబుమోహన్ మాట్లాడుతూ 'రేలంగి అవార్డు అందుకోవడం ఆనందంగా ఉంది. ఈ 41ఏండ్ల నట జీవితంలో నన్ను పోత్సహించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరున ధన్యవాదాలు తెలుపుతున్నాను. అవార్డుల కంటే ప్రజల ఆశీస్సులే గొప్ప దీవెన. ఇక 'పద్మ' అవార్డు వస్తే సంతోషం. రాకపోయినా ఫర్వాలేదు' అని బాబుమోహన్ అన్నారు.

# పెద్ద మనసు చాటుకున్న చిరంజీవి



ప్రముఖ నటుడు చిరంజీవి మరోసారి పెద్ద మనసు చాటుకున్నారు. ఆపదలో ఉన్న తన సిబ్బందిని ఆర్థిక సాయంతో ఆదుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి నేనున్నానంటూ భరోసా ఇచ్చారు. మేకప్ ఆర్టిస్ట్ శివనాథ్ హార్ట్ సర్జరీ కోసం రూ.10.5 లక్షలు, మాజీ మేనేజర్ నరసయ్య సతీమణి బైపాస్ సర్జరీకి రూ.9.5 లక్షలు అందజేశారు. సాయం చేయడమే కాదు శస్త్ర చికిత్సల ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించి, ఆ కుటుంబాలకు అండగా నిలిచారు.

Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 9666052221**

# చిలుకూరులో డీసీసీబీ బ్యాంక్ సేవలు ప్రారంభం

### రైతులకు మేలు: ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి

**నేటి సాక్షి,చిలుకూరు :** మండల కేంద్రమైన చిలుకూరులో నల్గొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (DCCB) నూతన శాఖను స్థానిక ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి సోమవారం ఘనంగా ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన ఈ శాఖ రైతులకు మరింత చేరువగా సేవలు అందించనుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి మాట్లాడుతూ.. చిలుకూరు మండల కేంద్రంలో నూతన బ్రాంచ్ ఏర్పాటు చేయడం వల్ల ఈ ప్రాంత రైతులకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. బ్యాంకు ద్వారా లభించే రుణాలు, ఇతర ఆర్థిక సేవలు నేరుగా రైతులకు అందడం వల్ల సాగు పనులకు అవసరమైన పెట్టుబడి సకాలంలో సమకూరుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. సహకార బ్యాంకుల బలోపేతంతోనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుందని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల నుండి వచ్చిన రైతులు మరియు పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలోపాల్గొన్నారు.



# ఇబ్రహీంపట్నంలో అంబేద్కర్ విగ్రహ నిర్మాణం



**నేటి సాక్షి,మరికల్ (ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లా మరికల్ మండల పరిధిలోని ఇబ్రహీంపట్నం గ్రామంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు సోమవారం ఘనంగా అంకురార్పణ జరిగింది. గ్రామ సర్పంచ్ నాగరాణి రఘు ఆధ్వర్యంలో విగ్రహ నిర్మాణ స్థలంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. దేశానికి దిశానిర్దేశం చేసిన రాజ్యాంగబద్ధమైన హక్కులను కల్పించిన మహానుభావుడు అంబేద్కర్ అని కొనియాడారు. అటువంటి మహనీయుని విగ్రహాన్ని గ్రామంలో ఏర్పాటు చేసుకోవడానికి సహకరించిన గ్రామ ప్రజలందరికీ ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విగ్రహ ఏర్పాటు ద్వారా ఆయన ఆశయాలను నేటి తరానికి చాటిచెప్పవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మునిస్వామి, వార్డు సభ్యులు రవిచంద్ర కుమార్, అంజి, శ్రీను మరియు గ్రామ పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్ర అభివృద్ధి





**నేటి సాక్షి,చౌడేపల్లి :** కూటమి ప్రభుత్వ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలోనే రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు మాదిరాజు లక్ష్మణ పతి రాజు అన్నారు. సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదినాన్ని పురస్కరించుకొని స్థానిక బస్టాండ్ ఆవరణలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేసి అభిమానులకు, ప్రజలకు మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా పతిరాజు మాట్లాడుతూ..

- **చౌడేపల్లిలో ఘనంగా సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు**

రాష్ట్రం ఆర్థికంగా క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పటికీ, చంద్రబాబు తన అనుభవంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన 'సూపర్ సిక్స్' పథకాలతో పాటు, అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. దేశంలోనే అత్యుత్తమ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజా నాయకుడిగా ఎదిగారని, నవీన రాజకీయ నాయకులకు ఆయన ఆదర్శప్రాయుడని పేర్కొన్నారు. వేడుకల అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన శిబిరాన్ని ప్రజలు పెద్ద సంఖ్యలో వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ హరీ రాయల్, టిడిపి నాయకులు ఆవుల రామచంద్రయ్య, వేలూరు సుబ్రహ్మణ్యం, కార్తీక్, మురళి, విద్యాసాగర్, బోయకొండ పవన్, రామకృష్ణ, శివప్ప, పునీత్ రాజు, కుంచి నరేష్, బోయకొండ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# గజ్వేల్ మున్సిపల్ కో-ఆప్షన్ స్థానాలకు పోటాపోటీ



- **4 స్థానాలకు 40 మంది నామినేషన్లు.. ఆశావహుల్లో ఉత్కంఠ**

**నేటి సాక్షి,గజ్వేల్ :** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో కో-ఆప్షన్ సభ్యుల ఎంపిక ప్రక్రియ రాజకీయంగా వేడి పుట్టిస్తోంది. మొత్తం నాలుగు కో-ఆప్షన్ స్థానాలకు గాను నామినేషన్ల గడువు సోమవారంతో ముగియగా, ఏకంగా 40 మంది అభ్యర్థులు బరిలో నిలవడం ఇప్పుడు స్థానికంగా హాట్ టాపిక్‌గా మారింది. కేవలం నాలుగు స్థానాల కోసం ఇంత భారీ స్థాయిలో నామినేషన్లు రావడంతో అభ్యర్థుల ఎంపిక పార్టీ అధిష్టానానికి కత్తిమీద సాములా మారింది. మున్సిపల్ ఎన్నికల సమయంలో పోటీ నుంచి తప్పుకున్న పలువురికి "కో-ఆప్షన్ సభ్యులుగా అవకాశం కల్పిస్తాం" అని పార్టీ నేతలు అప్పట్లో హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇప్పుడు ఆ హామీలే ఎంపిక ప్రక్రియను క్లిష్టతరం చేస్తున్నాయి. ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో ఎవరికి అవకాశం దక్కుతుందోనన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొంది.

సామాజిక సమీకరణాలపై కసరత్తు

కో-ఆప్షన్ స్థానాల భర్తీలో సామాజిక సమీకరణాలకు పెద్దపీట వేయాలని పార్టీ భావిస్తోంది. నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాపరెడ్డి సూచనల మేరకు నాలుగు స్థానాలను విభజించే అవకాశం ఉంది. ఇందులో రెండు స్థానాలను మైనార్టీ కోటాలో (ఒక మహిళ, ఒక పురుషుడు) భర్తీ చేయాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు సమాచారం. మిగిలిన రెండు జనరల్ స్థానాల్లో కూడా ఒక మహిళకు, ఒక పురుషుడికి అవకాశం కల్పించేలా కసరత్తు జరుగుతోంది. గత రెండు రోజులుగా అభ్యర్థుల రాజకీయ నేపథ్యం, పార్టీ పట్ల విధేయత వంటి అంశాలపై నాయకత్వం సుదీర్ఘంగా చర్చిస్తోంది. 40 మంది ఆశావహులు ఉండటంతో ఒత్తిడి పెరిగినప్పటికీ, పార్టీ బలోపేతానికి తోడ్పడే వారికే ప్రాధాన్యం ఇవ్వాలని అధిష్టానం యోచిస్తోంది. త్వరలోనే తుది జాబితాను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

# నల్లబెల్లిలో సిపిఐ బలోపేతం

### పార్టీలో చేరిన పలువురు ప్రజాసంఘాల నేతలు



**నేటి సాక్షి,నల్లబెల్లి :** మండలంలోని సామాజిక ప్రజాసంఘాల నాయకులు సోమవారం భారీ సంఖ్యలో సిపిఐ పార్టీలో చేరారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు చింతకింది కుమారస్వామి ఆధ్వర్యంలో బట్టు సాంబయ్య, పరికి కోర్నేల్, మామిండ్ల పెద్ద అయిలయ్య, కన్కం సాల్మన్, కన్కం కోర్నేల్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి కుమారస్వామి ఎర్ర కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా చింతకింది కుమారస్వామి మాట్లాడుతూ.. భారత కమ్యూనిస్ట్ పార్టీ వందేళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన పార్టీ అని, స్వాతంత్ర్య ఉద్యమం నుండి నిజాం భూస్వామ్య వ్యతిరేక తెలంగాణ సాయుధ పోరాటం వరకు ఎన్నో చారిత్రాత్మక ఉద్యమాలకు నాయకత్వం వహించిందని గుర్తుచేశారు. దేశంలోని అనేక రాజకీయ పార్టీలు ఉచితాలు, తాయిలాలతో ప్రజలను మోసం చేస్తున్నాయని, పేదలకు రాజ్యాధికారం దక్కకుండా చేస్తున్నాయని విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో ఎక్కడా అవకాశవాదానికి తావు లేకుండా పాల్గొన్న ఏకైక పార్టీ సిపిఐ అని కొనియాడారు. పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ.. ధన రాజకీయాలకు వ్యతిరేకంగా, నిజాయితీతో కూడిన నిస్వార్థ రాజకీయాల కోసం సిపిఐలో చేరడం గర్వంగా ఉందన్నారు. ఇకపై అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం, పేదల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు. రైతులు, వ్యవసాయ కూలీలు, నిరుద్యోగ యువతకు సిపిఐ సరైన వేదిక అని, ఈ వర్గాలన్నీ పార్టీలో పెద్ద ఎత్తున చేరాలని వారు పిలుపునిచ్చారు.

# కలెక్టరేట్‌లో బసవన్న జయంతి

### నివాళులర్పించిన కలెక్టర్ సత్యప్రసాద్



**నేటి సాక్షి,జగిత్యాల(పూరెళ్ల బాపు):** తత్వవేత్త, సామాజిక సంస్కర్త మహాత్మ బసవేశ్వరుని జయంతి వేడుకలను జగిత్యాల జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ బసవన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 12వ శతాబ్దంలోనే కుల, లింగ, వర్ణ విభేదాలను వ్యతిరేకించి సమానత్వాన్ని బోధించిన మహానుభావుడు బసవేశ్వరుడని కొనియాడారు. 'అనుభవ మంటపం' స్థాపన ద్వారా ప్రజాస్వామ్య విలువలకు పునాదులు వేశారని, ఆయన బోధనలు దేశవ్యాప్తంగా ఎంతో ప్రభావం చూపాయని గుర్తు చేశారు. సమాజంలో అహింస, సత్యం, న్యాయం వంటి మహోన్నత విలువలతో జీవించాలని బసవన్న చాటిచెప్పారని, అట్టడుగు వర్గాల ప్రజలు గౌరవంగా జీవించేలా ఆయన భరోసా కల్పించారని పేర్కొన్నారు. బసవేశ్వరుడు చూపిన మార్గం నేటి సమాజానికి ఎంతో ఆచరణీయమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్, జిల్లా బి.సి. సంక్షేమ అధికారి జి. సునీత, జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది మరియు వివిధ విభాగాల అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జగిత్యాల జిల్లా గ్రీవెన్స్ డే

### ఫిర్యాదులను పరిశీలించిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్



**నేటి సాక్షి, జగిత్యాల (పూరెళ్ల బాపు):** ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో బాగంగా ఈ రోజు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 6 గురు అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడడం జరుగుతోందని తెలిపారు.

# మానవత్వమే మతం.. సేవే ధర్మం

- పేద కుటుంబానికి అండగా కౌన్సిలర్ మీదిగడ్డ శ్రీనివాస్
- యువతి వివాహానికి రూ. 21 వేల ఆర్థిక సాయం..
- 'నికాహ్ ముబారక్ యోజన'తో భరోసా



**నేటి సాక్షి, పరిగి (సురేష్ మోత్కుర్):** రాజకీయం అంటే కేవలం అధికారం మాత్రమే కాదు, బాధ్యతతో కూడిన సేవ అని పరిగి మున్సిపాలిటీ 15వ వార్డు కౌన్సిలర్ మీదిగడ్డ శ్రీనివాస్ మరోసారి నిరూపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ, కష్టాల్లో ఉన్న ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తూ 'నిజమైన ప్రజా సేవకుడు' అనిపించుకుంటున్నారు. తన వార్డు పరిధిలోని ఒక నిరుపేద కుటుంబంలో జరిగిన వివాహానికి ఆయన స్వయంగా ఆర్థిక సహాయం అందించి తన ఉదారతను చాటుకున్నారు. వార్డులోని హషమ్ ఖురేషి సాదక్ కుమార్తె వివాహానికి కౌన్సిలర్ మీదిగడ్డ శ్రీనివాస్ రూ. 21,000 నగదును ఆర్థిక సహాయంగా అందజేశారు. తను సొంతంగా రూపొందించుకున్న 'నికాహ్ ముబారక్ యోజన' ద్వారా మత, వర్గ భేదాలు లేకుండా పేద కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. వివాహ వేడుకకు హాజరైన ఆయన, నూతన వధూవరులను ఆశీర్వదించి ఈ చెక్కును అందజేశారు. ఒక కుటుంబం ఆర్థిక ఇబ్బందుల వల్ల వివాహాన్ని జరిపించడంలో ఇబ్బంది పడకూడదన్నదే తన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో తాను వార్డు ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటానని శ్రీనివాస్ స్పష్టం చేశారు. "నేను మాటల మనిషిని కాదు.. చేతల మనిషిని. ప్రజలు నాపై ఉంచిన నమ్మకాన్ని ఎప్పటికీ వమ్ము చేయను" అని ఆయన ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. కౌన్సిలర్ శ్రీనివాస్ చూపిస్తున్న ఈ చొరవపై వార్డు ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఆపదలో ఉన్నప్పుడు స్పందిస్తూ, సొంత నిధులతో సహాయం చేయడం ఒక మంచి పరిణామమని స్థానికులు కొనియాడుతున్నారు. ఏ సమస్య వచ్చినా ముందుండే నాయకుడిగా శ్రీనివాస్ పరిగి మున్సిపాలిటీలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు.

# ఏప్రిల్ 27 నుండి వస్త్ర పరిశ్రమ నిరవధిక సమ్మె





**నేటి సాక్షి,రాజన్న సిరిసిల్ల (శివకుమార్):** పాలిస్టర్ వస్త్రానికి కూలి పెంచాలని డిమాండ్ చేస్తూ ఈనెల 27 నుండి నిరవధిక సమ్మెకు వెళ్తున్నట్లు పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ముషం రమేష్ ప్రకటించారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో పాలిస్టర్ వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల (వార్పిన్, వైపని, ఆసాములు) నాయకులతో కలిసి వస్త్ర వ్యాపార భవనం వద్ద ఒకరోజు దీక్ష నిర్వహించారు. ఈ దీక్షా కార్యక్రమాన్ని రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత నాలుగేళ్లుగా కూలి పెంపు లేకపోవడంతో కార్మికులు, ఆసాములు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని ఆవేదన

- పాలిస్టర్ వస్త్రానికి కూలి పెంచాలని సీఐటీయూ డిమాండ్

వ్యక్తం చేశారు. నిత్యావసర ధరలు, మిల్ స్టోర్ ధరలు 100 శాతం పెరిగినా, యజమానులు కేవలం తమ లాభాల కోసమే ఆలోచిస్తూ కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సరైన ఆదాయం లేక కార్మికులు అనారోగ్య పాలవుతున్నారని, చాలామంది ఈ వృత్తిని వదిలి వెళ్తున్నారని తెలిపారు.

ప్రభుత్వ వస్త్రాల ఉత్పత్తి కూడా బంద్

ఏప్రిల్ 27 నుండి ప్రారంభమయ్యే ఈ సమ్మెలో పాలిస్టర్ వస్త్రంతో పాటు ప్రభుత్వ వస్త్రాల ఉత్పత్తిని కూడా నిలిపివేయాలని నిర్ణయించారు. యజమానులు వెంటనే స్పందించి న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని, లేనిపక్షంలో సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ దీక్షలో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, ఆసాముల సంఘం అధ్యక్షుడు సిరిసిల్ల రవి, వార్పిన్ యూనియన్ అధ్యక్షుడు సిరిమల్లె సత్యం, వైపని యూనియన్ అధ్యక్షుడు కుమ్మరికుంట కిషన్, నాయకులు ఉడుతా రవి, ఎలిగేటి శ్రీనివాస్, ఆడెపు మోహన్, బాస శ్రీధర్, స్వర్గం శేఖర్, రాజు, బెజ్జగం సురేష్, సబ్బని చంద్రకాంత్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నదాస్ గణేష్, ఎలిగేటి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# వికారాబాద్‌లో ఏకో అర్బన్ పార్కు ప్రారంభం



- పర్యాటకానికి కొత్త శోభ
- అనంతగిరి ఏకో అర్బన్ పార్కును ప్రారంభించిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్
- రూ. 2.50 కోట్లతో పర్యాటక హబ్‌గా అభివృద్ధి.. ఉపాధి అవకాశాలకు పెద్దపీట

**నేటి సాక్షి,వికారాబాద్ :** తెలంగాణ కశ్మీర్‌గా పేరుగాంచిన అనంతగిరి ప్రాంతాన్ని అన్ని విధాలుగా పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దుతామని రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. సోమవారం వికారాబాద్ నియోజకవర్గ పరిధిలో రూ. 2.50 కోట్ల వ్యయంతో నూతనంగా అభివృద్ధి చేసిన 'అనంతగిరి ఏకో అర్బన్ పార్కు'ను ఆయన ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. అనంతగిరి అందమైన ప్రకృతి సంపదకు నిలయమని, పర్యావరణానికి ఎలాంటి హాని కలగకుండా అన్ని వసతులతో ఏకో టూరిజం ప్రాజెక్టులను చేపడుతున్నామని తెలిపారు. పర్యాటకులకు అద్భుతమైన అనుభూతిని అందించేలా వాచ్ టవర్లు, ఇతర మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేశామని వివరించారు. పర్యాటక రంగం అభివృద్ధితో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం అనన్య, ఏఎంసీ చైర్మన్ చాపల శ్రీనివాస్ ముదిరాజ్, పీసీసీఎఫ్ డాక్టర్ సువర్ణ, ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ సునీత భగవత్, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ప్రియాంక వర్గీస్, టూరిజం వింగ్ డైరెక్టర్ రంజిత్ నాయక్, జిల్లా అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్, అటవీశాఖ సిబ్బంది, కాంగ్రెస్ సీనియర్ నాయకులు



మరియు పర్యాటకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థులకు రాజ్యాంగం పై అవగాహన ఉండాలి



**నేటిసాక్షి,నల్లబెల్లి:** విద్యార్థులు భారత రాజ్యాంగం పట్ల అవగాహన కలిగి ఉండాలని దళిత విద్యావంతుల ఐక్యవేదిక జిల్లా కార్యదర్శి బట్టు సాంబయ్య అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక గ్రంథాలయ ఆవరణలో తెలంగాణ దళిత విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా జిల్లా స్థాయిలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 86 మంది విద్యార్థులు పోటీలో పాల్గొనగా సోమవారం విజేతలకు బహుమతులను అందచేశారు. ఈ సందర్భంగా దళితరత్న అవార్డు గ్రహీత పరికరత్నం మాట్లాడుతూ... విజ్ఞానం, నైపుణ్యాల అభివృద్ధి ద్వారానే పోటీ ప్రపంచంలో ముందుకు సాగవచ్చని చెప్పారు. ఉన్నత విద్యలు అభ్యసించి ఉన్నత ఉద్యోగాలు సాధించడం ద్వారా కుటుంబం, గురువులకు గౌరవం తీసుకురావడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం ప్రతి విద్యార్థి లక్ష్యంతో శ్రమించాలని సూచించారు. పోటీలో ప్రథమ బహుమతి గెలుచుకున్న పి. హర్షితను, ద్వితీయ బహుమతి పొందిన మరో విద్యార్థినికీ మెమొంటో, శాలువాలతో సన్మానించారు. విజేతలు ఇద్దరూ కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాల, నల్లబెల్లికి చెందినవారు కావటం గమనార్హం. ఈ కార్యక్రమంలో టి. శ్రీకాంత్, డి. సంతోష్, కందిశెట్టి శ్రీనివాస్, చిరంజీవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతోనే మానసిక ఉల్లాసం

ధన్వాడ ఎస్ఐ వెంకటేష్ గౌడ్



**నేటి సాక్షి, నారాయణపేట (ఇమామ్ సాబ్):** క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఆరోగ్యం సమకూరుతుందని ధన్వాడ ఎస్ఐ వెంకటేష్ గౌడ్ అన్నారు. సోమవారం కొండాపూర్ గిరిజన గురుకులంలో 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సమ్మర్ స్పోర్ట్స్ కోచింగ్ క్యాంపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నప్పటి నుండే క్రీడల పట్ల ఆసక్తి కనబరచాలని, క్రీడల్లో రాణించే వారు అన్ని రంగాల్లోనూ చురుకుగా ఉంటారని పేర్కొన్నారు. నిత్యజీవితంలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కోవడానికి క్రీడలు స్ఫూర్తినిస్తాయని తెలిపారు. ఈ నెల 29 వరకు జరగనున్న ఈ శిబిరంలో కొండాపూర్, పెద్దమందడి, మన్ననూరు గిరిజన గురుకులాల విద్యార్థులకు నెట్ బాల్ మరియు కరాటే అంశాల్లో మెలకువలు నేర్పనున్నారు. గురుకుల ప్రిన్సిపల్ ఎం. రాజారాం మాట్లాడుతూ.. గురుకుల కార్యదర్శి సీతాలక్ష్మి ఆదేశాల మేరకు విద్యార్థులకు ఆత్మరక్షణ కోసం కరాటే శిక్షణను కూడా ప్రారంభించినట్లు తెలిపారు. అలాగే ఈ విద్యా సంవత్సరంలో తమ ఇంటర్ విద్యార్థులు 98 శాతం ఉత్తీర్ణత సాధించారని ఈ సందర్భంగా వెల్లడించారు. నెట్ బాల్ అకాడమీ కోచ్ డాక్టర్ రాంమోహన్ గౌడ్ మాట్లాడుతూ.. గిరిజన గురుకులాల్లో ఉన్న మెరికల్లాంటి క్రీడాకారుల ప్రతిభను వెలికి తీయడమే ఈ శిబిరం లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ లెక్చరర్ జి. లక్ష్మయ్య, జూనియర్ వైస్ ప్రిన్సిపల్ సాంబ్యా నాయక్, క్యాంప్ ఇంచార్జ్ ఆంజనేయులు, పీడీ రవీందర్, కరాటే శిక్షకులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ బసవ జయంతి

ధన్వాడలో ఘనంగా పూజలు



**నేటి సాక్షి, ధన్వాడ(ఇమామ్ సాబ్):** ధన్వాడ మండల కేంద్రంలో 893వ మహాత్మా బసవేశ్వర జయంతి వేడుకలను సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వీరశైవ లింగాయత్ సంఘం ఆధ్వర్యంలో మండల కార్యాలయం వద్ద మరియు శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఈ వేడుకల్లో తహసీల్దార్ సింధుజ పాల్గొని బసవన్న చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. సమానత్వం కోసం బసవేశ్వరుడు చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వీరశైవ లింగాయత సంఘం సభ్యులు గాజుల నారాయణస్వామి, జాజిమి వీరప్ప, జాజిమి వీరభద్రప్ప, అవుట్ సురేష్ కుమార్, కే. సిద్దు, కల్లెత్తి ప్రవీణ్, సుంకరి రాజప్ప, జాజిమి శివకుమార్, ఏ. శ్రీశైలం, అవుట్ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లకు కంట్రోల్ రూం



**నేటిసాక్షి, కరీంనగర్:** రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు గాను కంట్రోల్ రూంను ఏర్పాటుచేసినట్లు కరీంనగర్ జిల్లా పౌర సరఫరాల అధికారి నర్సింగరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ధాన్యం అమ్మే క్రమంలో ఏమైనా సమస్యలు ఎదురైనట్లయితే 9154249727 నెంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని సూచించారు.

# భవన నిర్మాణ విషయమై ఘర్షణ

## స్థానిక సర్పంచ్ భర్త పై దాడి

**నేటి సాక్షి, చిలుకూరు:** సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల కేంద్రంలో శిలా వ్యవస్థకు చేరిన పాత కమ్యూనిటీ హాల్ స్థానంలో నూతన భవనాన్ని నిర్మించారు దీని సోమవారం ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించేందుకు సర్పంచ్ భర్త కుళ్ళు నాగయ్య భవనాన్ని శుభ్రం చేయించి విద్యుత్ కాంతులను ఏర్పాటు చేశారు ఈ క్రమంలో గుత్తేదారు సంబంధించిన వ్యక్తులు నిర్మాణ విషయంలో కొన్ని నిధులు మంజూరు కాలేదని ప్రారంభించడానికి వీలు లేదని కుళ్ళు నాగయ్య పై దాడి దిగారు ఈ నేపథ్యంలో దాడి చేశారని నాగయ్య స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా స్థానిక ఎస్సై హనుమాన్ నాయక్ ఘటన స్థలాన్ని చేరుకొని నిందితులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ తరలించారు కేసు నమోదు చేసి రిమాండ్ కు పంపనున్నట్లుగా ఎస్ఐ తెలిపారు.

# గోపాల్ పూర్‌లో బడిబాట

## కరపత్రం ఆవిష్కరించిన కరీంనగర్ రూరల్ మండల విద్యాధికారి వాసవి



**నేటి సాక్షి,కరీంనగర్ :** మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల గోపాల్ పూర్ నందు ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బడిబాట కార్యక్రమాన్ని కరీంనగర్ రూరల్ ఎంఈఓ వాసవి ప్రారంభించి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన, గుణాత్మక విద్య లభిస్తుందని ఉచిత యూనిఫామ్ లు, పాఠ్యపుస్తకాలు,మధ్యాహ్న భోజనము, రాగి జావ లాంటి అనేక సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందని అలాగే వచ్చే విద్యా సంవత్సరం నుండి ఉదయం అల్పాహారం అందించడంతోపాటు ప్రతి విద్యార్థికి 21 వస్తువులతో కూడిన కిట్ ఇవ్వబడుతుందని గ్రామస్తులందరు ఆలోచించి పెద్ద మొత్తంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని మండల విద్యాధికారి వాసవి కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మందల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సుశిక్షితులైన ఉపాధ్యాయ బృందంచే విద్యార్థుల నిరంతర అభివృద్ధికి కృషి చేస్తున్నామని విద్యతో పాటు సహపాఠ్య కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నామని విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సంధ్యారాణి, శివకుమారి అంగన్వాడి టీచర్ పుష్పలత తదితరులు పాల్గొన్నారు

# గొప్ప సంఘసంస్కర్త బసవేశ్వరుడు

## జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా



**నేటిసాక్షి, కరీంనగర్:** వందల ఏళ్ల కిందటే కుల, లింగ, వర్ణ వివక్షకు వ్యతిరేకంగా పోరాడి, తన బోధనలతో ప్రజల్ని చైతన్యవంతుల్ని చేసిన మహనీయుడు, గొప్ప సంఘసంస్కర్త బసవేశ్వరుడని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం బసవేశ్వరుడి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి జిల్లా కలెక్టర్ సహా ఇతర అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ బసవేశ్వరుడు చెప్పినట్లు విద్యను నమ్ముకుని మనమంతా ముందుకు సాగాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మహేశ్వర్, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి అనిల్ ప్రకాష్, ఉన్నత అధికారులు, వీరశైవ లింగాయత్‌ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు న్యాలమడుగు శంకరయ్య, 9వ డివిజన్ కార్పొరేటర్ పడిశెట్టి వసంత లక్ష్మి భూమయ్య, లుక్క రాజేశం, గాజుల స్వప్న కరుణాకర్, అంజయ్య, ఆంజనేయులు, బాకం సంతోష్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# గన్నేరువరం నుండి కాటారం కాంగ్రెస్ శ్రేణుల పయనం



**నేటి సాక్షి,గన్నేరువరం (బుర్ర అంజయ్య గౌడ్):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాటారంలో నిర్వహించిన భారీ బహిరంగ సభకు గన్నేరువరం మండలం నుండి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. సోమవారం మండల కేంద్రం నుండి ప్రైవేట్ వాహనాల్లో పార్టీ జెండాలు పట్టుకొని భారీ కాన్వాయ్‌తో బయలుదేరారు. ఈ సందర్భంగా మండల పార్టీ నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సాగుతున్న రేవంత్ రెడ్డి పాలనకు మద్దతుగా ఈ సభను విజయవంతం చేయడానికి వెళ్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గన్నేరువరం మండల కాంగ్రెస్ అధ్యక్షులు ముసుకు ఉపేందర్ రెడ్డి, కరీంనగర్ జిల్లా కార్యదర్శి కొమ్మిరి రవీందర్ రెడ్డి, ఎస్సీ సెల్ నాయకుడు మాతంగి అనిల్, బుర్ర మల్లేశం, బుర్ర తిరుపతి, న్యాత జీవన్, వినయ్, మునీందర్ మరియు ఇతర అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెద్దకడుబూరులో 'బడి పిలుస్తోంది'

- ప్రభుత్వ పాఠశాలల్లో చేరాలని ఎంఈవో పిలుపు
- ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

ఎంఈవో రామ్మూర్తి




**నేటి సాక్షి,పెద్దకడుబూరు :** వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచడమే లక్ష్యంగా పెద్దకడుబూరు మండల కేంద్రంలోని మెయిన్ ఎంపీపీ పాఠశాలలో సోమవారం 'బడి పిలుస్తోంది' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారుల ఆధ్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఈవో రామ్మూర్తి నేతృత్వంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామంలోని ప్రధాన వీధుల గుండా భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. "ప్రతి బిడ్డకు విద్య హక్కు", "ప్రభుత్వ పాఠశాలలే పిల్లల భవిష్యత్తుకు ఆధారం" వంటి నినాదాలతో ప్రజల్లో చైతన్యం కల్పించారు. తల్లిదండ్రులను నేరుగా కలిసి తమ పిల్లలను ప్రభుత్వ బడిలోనే చేర్పించాలని కోరారు. అనంతరం ఎంఈవో మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధనతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫార్ములు, మరియు మధ్యాహ్న భోజన పథకం వంటి అనేక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు బోధన అందిస్తున్నారని, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వివరించారు. కొత్తగా ప్రవేశాలు పొందాలనుకునే వారు వెంటనే సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులను సంప్రదించి నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# బాపులదొడ్డిలో తాగునీటి కష్టాలు



**నేటి సాక్షి :** పెద్దకడబూరు మండలం బాపులదొడ్డి గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. గ్రామంలో సరిపడా తాగునీరు అందక ప్రజలు రోజువారీ జీవితంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ శివారుల్లోని పొలాల్లో ఉన్న బోర్ల వద్దకు తోపుడు బళ్లతో వెళ్లి నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. చిన్నపిల్లలు, మహిళలు దూరప్రాంతాలకు వెళ్లి గుక్కెడు మంచినీరు కోసం శ్రమ పడుతున్నారు. ఈ పరిస్థితి గ్రామ ప్రజల జీవన ప్రమాణాలను మరింత దెబ్బతీస్తోంది. తాగునీటి కోసం ఇన్ని కష్టాలు పడుతున్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడం పట్ల గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు సమస్యను తెలియజేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి గ్రామానికి శాశ్వత తాగునీటి సౌకర్యం కల్పించాలని, కనీసం తాత్కాలికంగా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# పాములపాడులో చంద్రబాబు జన్మదిన వేడుకలు



- కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్న తెలుగుదేశం శ్రేణులు



**నేటి సాక్షి,పాములపాడు :** నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి 76వ జన్మదిన వేడుకలను మండల కేంద్రమైన పాములపాడులో సోమవారం ఘనంగా నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి చంద్రబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా క్లస్టర్ ఇంచార్జి బండ్లమూరి వెంకటేశ్వరరావు, పాములపాడు సొసైటీ చైర్మన్ రాయపాటి గోవిందు, తెలుగుయువత మండల అధ్యక్షుడు షేక్ కరీంబాష ఆధ్వర్యంలో భారీ కేక్‌ను కట్ చేశారు. ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ సంతోషాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడు విజన్ ఉన్న నాయకుడని, ఆయన అనుభవంతో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని కొనియాడారు. పేదల సంక్షేమం కోసం ఆయన ప్రవేశపెట్టిన పథకాలు ప్రతి ఇంటికి చేరుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జూటూరు నాయకులు నాయిని మధు, టీఎన్టీయూసీ మండల అధ్యక్షుడు జడల నాగరాజు, నాయకులు సతీష్, లేపాక్షి, శివశంకర్, మనోహర్, నాగశేషులు, శివ, రాయపాటి మల్లికార్జున, బన్నీ, లక్ష్మీనారాయణ, వాజీద్ మరియు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# రాష్ట్రాభివృద్ధి కోసమే చంద్రబాబు పోరాటం



- రుద్రవరంలో ఘనంగా సీఎం జన్మదిన వేడుకలు..
- పాల్గొన్న స్టేట్ సివిల్ సప్లై డైరెక్టర్ మహేష్ నాయుడు



**నేటి సాక్షి,రుద్రవరం:** నంద్యాల జిల్లా పాములపాడు మండలం రుద్రవరం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 76వ జన్మదిన వేడుకలను సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు స్టేట్ సివిల్ సప్లై డైరెక్టర్ మహేష్ నాయుడు ముఖ్య అతిథిగా విచ్చేసి, చంద్రబాబు చిత్రపటానికి నివాళులర్పించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక టీడీపీ నాయకుడు హుసేన్ బాషా ఆధ్వర్యంలో గ్రామంలో భారీ కేక్‌ను కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహేష్ నాయుడు మాట్లాడుతూ.. ప్రజల మనసుల్లో నిలిచిపోయే నాయకత్వం, అపారమైన దూరదృష్టి చంద్రబాబు ప్రత్యేకత అని కొనియాడారు. 76 ఏళ్ల వయసులో కూడా రాష్ట్రాభివృద్ధి కోసం అహర్నిశలూ కృషి చేస్తున్న గొప్ప విజనరీ లీడర్ అని అభివర్ణించారు. కార్యకర్తలను సొంత కుటుంబ సభ్యులుగా భావించే గొప్ప వ్యక్తిత్వం ఆయనదని, సాంకేతికత మరియు పారదర్శకతతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని పేర్కొన్నారు. సంక్షోభ సమయాల్లోనూ సంక్షేమ పథకాలను అందిస్తూ ముందుకెళ్తున్న చంద్రబాబు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆ భగవంతుడిని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మధు, రామసుబ్బయ్య, బషీర్, మల్లికార్జున, హిమామ్ ఖాసీం, కరీముల్లా, రామకృష్ణ, రమణారెడ్డి, శివుడు, నబిరసూల్, ప్రవీణ్, శివ, నాగేశ్వరావు, శివ కుమార్, సద్దాం, శేఖర్, గ్రామ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పెద్దకడబూరులో చంద్రబాబు జన్మదిన వేడుకలు



**నేటి సాక్షి :** పెద్దకడబూరు గ్రామంలో సోమవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా నరవ రమాకాంతరెడ్డి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి నరవ శశిరేఖ, కోసిగి మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షులు బొగ్గుల తిక్కన్న కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి కేక్ కట్ చేసి పరస్పరం తినిపించుకున్నారు. అనంతరం స్వీట్లు పంచుతూ సంబరాలు జరుపుకున్నారు. నాయకులు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు.

## ధర్నాతో కదిలిన యంత్రాంగం

### కొనుగోలు కేంద్రానికి గ్రీన్ సిగ్నల్



**నేటిసాక్షి, తిరుమలాయపాలెం (రుద్రరాజు):** ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంలో శనివారం రోజున మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని తేట్టెలపాడు క్రాస్ రోడ్ జాతీయ రహదారి లో జరిగిన ఆందోళనల ఫలితంగా పిండిప్రోలు గ్రామంలో నూతన మొక్కజొన్న కొనుగోలు కేంద్రం కొరకు స్పెషల్ ఆఫీసర్ రమేష్ మండల వ్యవసాయ శాఖ అధికారి సీతారాం రెడ్డి రైతుల బాధలు తెలుసుకొని జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేయడం జరిగింది. జిల్లా అధికారులు వెంటనే స్పందించి పిండిప్రోలు లో మంగళవారం మొక్కజొన్న కొనుగోలు కేంద్ర ప్రారంభించనున్నట్లు తెలిపారు. టిఆర్ఎస్ మండల నాయకులు బిల్లంగిరి ధనుంజయ్ మాట్లాడుతూ తమ సమస్యల్ని పట్టించుకుని స్పందించిన అధికారులకు కృతజ్ఞతలు తెలుపుతూ కొనుగోలు కేంద్రాల పెంపుతో సరైన ధర లభిస్తున్నందుకు ఆశాభావం వ్యక్తం చేశారు రైతులు చేసిన ఈ రాస్తారోకో జిల్లా అధికారుల దృష్టికి చేరవేయడంలో మీడియా పాత్ర పోషించినందుకు మీడియా మిత్రులు అందరికీ నా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. రైతులకు అనుకూల పరిస్థితులు తీసుకువచ్చాయి అని రైతుల తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

# జగిత్యాల వేదికగా రాజకీయ సమీకరణాల మార్పు

- కేసీఆర్ సమక్షంలోనే 'బంధాల' బహిర్గతం
- జీవన్ రెడ్డితో అనుబంధాన్ని గుర్తుచేసుకున్న రెడ్యానాయక్.. రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్



**నేటి సాక్షి,మహబూబాబాద్ :** జగిత్యాలలో సోమవారం నిర్వహించిన 'ప్రజా ఆశీర్వాద సభ' కేవలం శక్తి ప్రదర్శనకే పరిమితం కాకుండా, పార్టీ అంతర్గత బంధాలకు, కొత్త రాజకీయ సమీకరణాలకు వేదికగా నిలిచింది. ఈ సభలో డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీశాయి. ముఖ్యంగా పార్టీ అధినేత కేసీఆర్ సమక్షంలోనే సీనియర్ నేత జీవన్ రెడ్డితో తనకున్న దశాబ్దాల అనుబంధాన్ని ఆయన బహిర్గతం చేయడం విశేషం. సభలో మాట్లాడిన రెడ్యానాయక్.. డోర్నకల్ నుండి జగిత్యాల వరకు ఉన్న రాజకీయ సంబంధాలను ప్రస్తావిస్తూ, జీవన్ రెడ్డితో తనకున్న సన్నిహిత సంబంధాన్ని వివరించారు. ఇదే సభలో జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరిన తరుణంలో, రెడ్యానాయక్ చేసిన ఈ వ్యాఖ్యలు పార్టీలో నేతల మధ్య ఉన్న నమ్మకాన్ని, పాత పరిచయాల బలాన్ని చాటిచెప్పాయి. ఇది కేవలం వ్యక్తిగత పరిచయ ప్రస్తావన మాత్రమే కాదని, పార్టీ అంతర్గత బలాన్ని పెంచే దిశగా సాగిన వ్యూహాత్మక చర్యగా విశ్లేషకులు భావిస్తున్నారు.

సభలో హాట్ టాపిక్‌గా మారిన 'నమ్మకం'

కేసీఆర్ ముందే రెడ్యానాయక్ తన మనసులోని మాటను వెల్లడించడం ద్వారా, పార్టీలో సీనియర్ నేతల మధ్య సమన్వయం బలంగా ఉందనే సంకేతాన్ని పంపారు. భవిష్యత్ రాజకీయ నిర్ణయాలకు, వ్యూహాలకు ఈ అనుబంధం ఒక కీలక మలుపు అని రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు. ఈ పరిణామం జగిత్యాల సభకు మరింత రాజకీయ ప్రాధాన్యం కల్పించింది. ఈ కార్యక్రమంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, పార్టీ శ్రేణులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనగా, నేతల మధ్య ఈ కొత్త సమీకరణాలు సభ ముగిసిన తర్వాత కూడా చర్చనీయాంశంగానే ఉన్నాయి.

# చలివేంద్రంను ప్రారంభించిన సర్పంచ్

**నేటిసాక్షి, తిరుమలాయపాలెం (రుద్రరాజు):** ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం జూపెడ గ్రామంలో చలివేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్ వనవాసం నరేందర్ రెడ్డి ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ ఆశయంతో జూపెడ గ్రామంలో చలివేంద్రం ప్రారంభించినందుకు మాకు చాలా ఆనందకరంగా ఉందని ఈ వేసవి కాలంలో రోడ్డుమీద వెళ్లే ప్రతి ఒక్కరికి చలివేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎండ తీవ్రతకు అలసిపోకుండా చల్లని మంచినీరు అందించడమే మా జూపెడ ప్రజల ముఖ్య ఉద్దేశమని తెలిపారు అలాగే ఈరోజు గ్రామంలోని వెల్లుట్ల కృష్ణ సురేష్ ఇందిరమ్మ ఇంటి స్లాబ్ వేసే కార్యక్రమం ఉపాధి హామీ పథకం కూడా ప్రారంభించడం జరిగింది అన్నారు. ఈ కార్యక్రమంలో జూపెడ సర్పంచ్ వనవాసం నరేందర్ రెడ్డి ఉపసర్పంచ్ రాజశేఖర్ మాజీ ఎంపీటీసీ లంజపల్లి శ్రీనివాస్ వార్డ్ మెంబర్స్ విజయ ప్రభాకర్ రెడ్డి రామ్మూర్తి శ్రీకాంత్ సంపూర్ణ ఉమా వెంకన్న గ్రామ పెద్దలు ఇందుర్తి మల్లారెడ్డి తిప్పారెడ్డి శ్రీనివాస్ రెడ్డి బొల్లికొండ వెంకన్న మంగయ్య గోపాలమిత్ర వీరబాబు గ్రామ దీపిక వసంత అంగన్వాడీ టీచర్ పూలమ్మ వెంకన్న మధు లింగరాజు చింటూ నరేష్ శంకర్ మాన్సూరు వెంకన్న తదితరులు పాల్గొన్నారు



## అందరూ సమానులే

### ఘనంగా శ్రీ మహాత్మ బసవేశ్వర జయంతి వేడుకలు



**నేటి సాక్షి, పరిగి చౌడాపూర్. (సురేష్ మోత్కూర్ ):** ఈరోజు చౌడాపూర్ మండల కేంద్రంలోని మండల ఎంపీడీవో, ఎంఆర్ఓ, కార్యాలయం ఆవరణంలో శ్రీ బసవేశ్వర స్వామి 893 వ జయంతి వేడుకలను శ్రీ వీరశైవ సమాజ మరియు మండల వివిధ యువజన సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకొని, శ్రీ బసవేశ్వర స్వామి గారికి నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ 900 సంవత్సరాల క్రితమే మనుషులంతా సమానమే, లింగ బేదం లేదంటూ బోధించడం జరిగింది.నాటి ఆయన బోధనలే నేటికీ ఆచరణియమైనవి. నేటి యువతకు ఆచరణీయమైన ఆయన బోధనలు ఎంతగానో ఉపయోగంగా ఉంటాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీడీవో సోమలింగం,ఎమ్మార్వో వెంకటేశ్వర్లు,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎల్పటి అశోక్ కుమార్,గ్రామ సర్పంచ్ పరిగి నవీన్ కుమార్,వీరశైవ సంఘ నాయకులు డాక్టర్ శరభలింగం,మఠం రాజశేఖర్, మలమానాడు జిల్లా అధ్యక్షులు వెంకటేష్, బిజెపి మండల మాజీ అధ్యక్షులు బందయ్య,మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు. యువజన సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## యాప్ రద్దు చేయాలి

### సీపీఎం డిమాండ్



**నేటి సాక్షి:** పెద్దకడుబూరు మండలంలో ఉపాధి హామీ కూలీలకు తలనొప్పిగా మారిన ఫేస్ యాప్‌ను వెంటనే రద్దు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి తిక్కన్న డిమాండ్ చేశారు. సోమవారం మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) ప్రభావతి దేవికి పలు సమస్యలు, డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తిక్కన్న మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకంలో ఫేస్ యాప్ అమలు కారణంగా కూలీలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్యలు అధికంగా ఉండటంతో పనికి హాజరైనప్పటికీ హాజరు నమోదవడం లేదని, దీనివల్ల కూలీలకు వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అలాగే ఉపాధి పనుల్లో రాజకీయ నాయకుల జోక్యం పెరిగిందని, ఇది పారదర్శకతకు విఘాతం కలిగిస్తోందని ఆరోపించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న రెండు పూటల పని విధానాన్ని రద్దు చేసి, కూలీలకు అనుకూలంగా మార్పులు చేయాలని కోరారు. ప్రమాదవశాత్తు మరణించిన ఉపాధి కూలీల కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం అందించాలనే డిమాండ్‌ను కూడా వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ సమస్యలపై వెంటనే చర్యలు తీసుకొని కూలీలకు న్యాయం చేయాలని సీపీఎం నాయకులు కోరారు.

## జాలవాడిలో పారిశుద్ధ్య లోపం

### ప్రమాదకర వైద్య వ్యర్థాలపై ఆందోళన



**నేటి సాక్షి :** పెద్దకడబూరు మండలంలోని జాలవాడి గ్రామంలో పారిశుద్ధ్య పరిస్థితులు అధ్వాన్నంగా మారాయి. గ్రామంలోని శ్రీ భీమరాయ స్వామి ఆలయం పక్కన ఉన్న డ్రైనేజీలో ఆర్ఎంపీ వైద్యులు వాడిన సిరంజీలు, ఇతర వైద్య వ్యర్థాలను నిర్లక్ష్యంగా పడవేస్తుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ప్రమాదకర వ్యర్థాల వల్ల పరిసరాల్లో దుర్వాసన వ్యాపించడంతో పాటు, సంక్రమణ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు ఈ ప్రాంతంలో సంచరించడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశముందని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి వైద్య వ్యర్థాల నిర్వహణపై కఠిన చర్యలు తీసుకోవాలని, డ్రైనేజీని శుభ్రపరచి పారిశుద్ధ్య పరిస్థితులను మెరుగుపరచాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే నిర్లక్ష్యంగా వ్యర్థాలను పారవేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని

## మొక్కజొన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



**నేటి సాక్షి చిలుకూరు:** సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల లో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో మొక్కజొన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన .ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు ప్రభుత్వం మద్దతు ధర ఇస్తుందని అన్నారు ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో ధ్రువ కుమార్ ఎంపీడీవో ముక్కపాటి నరసింహారావు ఏడి ఏ ప్రశాంతి ఏవో శ్రీధర్ సర్పంచ్ కొల్లు పులమ్మ నాగయ్య సీఈవో చిలువేరు లక్ష్మీనారాయణ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీత వెంకటేశ్వర్లు యడవల్లి పుల్లారావు గ్రామ శాఖ అధ్యక్షుడు సోందుమియా కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు